
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 15 ఫిబ్రవరి 2025



కొండపావులూరు కొండలకు బోడిగుండ్లు

కొండపావులూరులోని సర్వే నెంబర్ 6లో పేదలకు ఇళ్ల పేరుతో విజయవాడ నగరంలోని 5 వేల మందికి ఇళ్ల పట్టాలు కేటాయించారు. ఇందుకోసం రైతుల ఆక్రమిత, డీ పట్టా భూములు తీసుకున్నారు. వీటి చదును కోసం సూదిగట్టు, గదబాలగట్టు, గుర్రంగట్టు, పాతగట్టు కొండలపై వైసీపీ అనుచరులు కన్నేశారు. ఎక్స్‌కవేటర్లతో రాత్రికి రాత్రే తవ్వించేశారు. ఒక రాత్రికి ఐదెకరాల చొప్పున తవ్వేశారంటే అర్థం చేసుకోవాలి. మూడు కొండలను బోడిగుండ్లుగా మార్చారు. సర్వే నెంబర్‌లోని మూడు కొండల నుంచి తవ్వుకున్న గ్రావెల్ ద్వారానే వంశీ అనుయాయులు కోట్ల రూపాయలను కూడబెట్టుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. నాటి అరాచకానికి పరాకాష్టగా ఇప్పుడీ కొండలు కనిపిస్తున్నాయి.

కొండలను పిండి చేశారు.. భూములను అక్రమించేశారు.. చెరువులను చెరపట్టారు.. మామిడి తోటలను సైతం మాయం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ఆయన అనుచరులు చేసిన అరాచకాలివి. అధికారం అనే అంధకారంలో.. అధికారులను కొనేసి సాగించిన అక్రమాల్లో రూ.కోట్లకు పడగలెత్తారు. నాటి వీరి పాపాలకు సాక్ష్యంగా నేడు గన్నవరంలో ఎటుచూసినా కరిగిపోయిన కొండలు.. తవ్వేసిన భూములే కనిపిస్తాయి.


మొత్తం ఇలా అక్రమంగా తవ్వేసిన కొండపావులూరు కొండ

అవినీతి కొండలు

గన్నవరంలో వంశీ అనుచరుల అక్రమాలు

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా అవినీతి

- కొండలన్నింటినీ బోడిగుండ్లుగా మార్చేశారు
- లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వేశారు
- చెరువులను చెరపట్టి మట్టిని తరలించారు
- గ్రావెల్ ఉన్న మామిడి తోటలనూ వదల్లేదు
- ఇన్నాళ్లకు పండిన పాపాల చిట్టా


కొండపావులూరులో మట్టి తవ్వకాలు (ఫైల్)



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుయాయులు బినామీ పేర్లపై కొండలను, చెరువులను, వాగులను, తోటలను చెరబట్టి మరీ ఈ మైనింగ్ చేపట్టారు. వీటిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలను కూడా ప్రచురించింది. పట్టిందల్లా బంగారమే అన్నట్టుగా కొండలు, చెరువులు, మామిడి తోటలు, పేదల భూములు.. అన్నింటినీ తమ అక్రమాల కోసం వాడుకున్నారు.

వెదురుపావులూరులో పేలుళ్లు

వెదురుపావులూరు కొండ ప్రాంతంలో అక్రమ క్వారీయింగ్ భారీగా జరిగింది. వెదురుపావులూరు, కొండపావులూరులో 300 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న కొండ ప్రాంతాన్ని భారీ పేలుళ్లతో పిండి చేశారు. దీనికోసం డ్రిల్లింగ్ మెషీన్లను తెప్పించి కొండకు ఐదారు మీటర్ల లోతున రంధ్రాలు చేసి, అందులో పేలుడు పదార్థాలను నింపి బ్లాస్టింగ్‌లు చేశారు. ఈ బ్లాస్టింగ్‌లతో పురుషోత్తపట్నం, కొండపావులూరు ప్రాంతాలు దద్దరిల్లాయి.

దుమ్మూధూళి రేగటంతో స్థానికులు గగ్గోలు పెట్టారు. రాత్రిపూట వందలాది భారీ టిప్పర్లు తిరిగాయి. ఇందులో నాటి రెవెన్యూ అధికారుల హస్తం కూడా ఉంది. ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. అప్పట్లో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు కూడా ఈ పాపంలో వాటాలు ఉండటంతో.. అడ్డుకున్న వారు లేకుండాపోయారు. ఇక్కడ జరిపిన తవ్వకాల ద్వారా కోట్ల రూపాయలను వంశీ అనుయాయులు సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సూరంపల్లి తోకతిప్పను పిండేశారు

సూరంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 526లోని 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తోకతిప్పను కూడా వంశీ అనుయాయులు వదల్లేదు. గ్రామస్థులు అడ్డుపడినా, అడ్డుకునే ప్రయత్నాలు చేసినా లెక్క చేయలేదు. వ్యవస్థలను చేతుల్లో పెట్టుకుని తోకతిప్పను తవ్వేశారు. ఏడాది పాటు ఏకబిగిన తవ్వేయటం ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించారు.

మల్లవల్లిని మింగేశారు

మల్లవల్లిలోని సర్వే నెంబర్ 11లో వంశీ అనుయాయులు 175 ఎకరాలను మిగతా 6లో..

చెరువులను చెరపట్టారు

గన్నవరం నియోజకవర్గంలోని అనేక చెరువులను వంశీ అనుయాయులు చెరపట్టారు. నాలుగు మండలాల పరిధిలో 80 శాతానికి పైగా చెరువులను ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వారు. కొండపావులూరులోని సర్వే నెంబర్ 144లోని ఎర్రచెరువు, బాపులపాడు మండలంలోని బిళ్లనపల్లి, రేమల్లెలోని ఊరచెరువు, వేలేరులోని ఊరచెరువు, కుంటలను 150 ఎకరాలకు పైగా తవ్వేశారు. గ్రామస్థులు అడ్డుకున్నా తవ్వకాలు ఆగలేదు. ఉంగుటూరులోని ఏ సీతారామపురం చెరువును రాత్రికి రాత్రే తవ్వేశారు. బాపులపాడు మండలంలోని కానుమోలులో ఉన్న 12 ఎకరాల చెరువును అడ్డగోలుగా తవ్వేశారు. గ్రామస్థులు పోరాడినా వదల్లేదు.

కోటి ఎక్కడ?

సత్యవర్ధన్ కేసు.. పరారీలో కీలక నిందితుడు


వంశీ చేయి పట్టుకుని నడుస్తున్న కొమ్మా కోట్లు (ఫైల్)

వంశీకి ప్రధాన అనుచరుడు

- ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- మిగిలిన వారి కోసం కొనసాగుతున్న వేట

విజయవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ముదునూరు సత్యవర్ధన్ కేసులో మిగిలిన నిందితులు ఎక్కడున్నారు? ముఖ్యంగా సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్‌కు రంగం సిద్ధం చేసిన వంశీ ప్రధాన అనుచరుడు కొమ్మా కోట్లు అలియాస్ కోటి ఎక్కడ దాక్కున్నాడు? వంశీ కేసులో ఉదయిస్తున్న ప్రశ్నలివి. సత్యవర్ధన్ కేసులో పటమట పోలీసులు వంశీతో పాటు నలుగురిని అరెస్టు చేశారు. దీంతో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది. వంశీ చెప్పిన ప్రణాళికను అమలు చేసిన కొమ్మా కోట్లు కోసం పోలీసులు గాలిస్తున్నారు. సత్యవర్ధన్‌ను ట్రాప్‌లోకి దింపి బెదిరించడంలో అతడు కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. తాజాగా వంశీ పీఏ ఘంటా వీర్రాజు, కారు డ్రైవర్ వంశీబాబును పోలీసులు అరెస్టు చేశారు. కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉన్నట్టుగా పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇందులో ఐదుగురికి పోలీసులు సంకెళ్లు వేశారు. మిగిలిన నిందితుల పేర్లు బయటకొస్తే వారు పరారయ్యే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

రెండో కేసు ఉన్నట్టేనా..?

వల్లభనేని వంశీ, ఆయన అనుచరులపై పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఇందులో క్రైం నెంబరు 86/2025ను మిగతా 6లో..

వంశీని కఠినంగా శిక్షించాలి

- అవనిగడ్డలో దళిత సంఘాల నిరసన 6లో


నేరెళ్లపాలెంలో నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నేతలు

సానుభూతి కరువు

వంశీ అరెస్టుపై నోరెత్తని వైసీపీ శ్రేణులు

- చోటా నాయకులు ఒకరిద్దరు తప్ప మిగతా వారంతా సైలెన్స్
- అరెస్టు నుంచి రిమాండ్ వరకూ కనిపించని ప్రధాన నేతలు
- సబ్‌జైల్లో ఉన్నా పరామర్శించేవారు లేరు
- వంశీ వ్యవహారంలో కార్యకర్తలు బలి
- కేసుల్లో చిక్కుకుని విలవిల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అరెస్టుపై ఎక్కడా సానుభూతి వ్యక్తం కావట్లేదు. వైసీపీ మిగతా 6లో..

ధాన్యం దయనీయం

అన్నదాతలకు అన్యాయమే జరుగుతోంది. మినుము తీతలకు సమయం ఆసన్నం కావడంతో కుప్ప నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో రైతుల వద్ద నాలుగు లక్షల టన్నుల ధాన్యం అమ్మకానికి సిద్ధమవ్వగా, ధాన్యం కొనుగోలు చేయాలని జేసీ గీతాంజలిశర్మ పౌరసరఫరాల సంస్థకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఆ శాఖ అధికారులు కేవలం 30 వేల టన్నులే కొనుగోలు చేసేందుకు ఈ నెల 10వ తేదీన అనుమతి ఇచ్చారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రైవేటు వ్యక్తులు ఇదే అదనుగా బస్తా ధాన్యాన్ని రూ.1,350 నుంచి 1,600 వరకు అడుగుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులే తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



జిల్లాలో రైతుల వద్ద ధాన్యం 4 లక్షల టన్నులు

కొనుగోలుకు అనుమతినిచ్చింది 30 వేల టన్నులకే..

- మిగిలిన ధాన్యం ఏం చేసుకోవాలని రైతుల కన్నీరు
- మినుము తీతల సమయం కావడంతో కుప్పనూర్పిళ్లు ముమ్మరం
- బస్తా రూ.1,350 నుంచి 1,600 వరకు తగ్గించి అడుగుతున్న మిల్లర్లు, మధ్యవర్తులు
- న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులకు అన్నదాతల విజ్ఞప్తి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలోని మచిలీపట్నం, కోడూరు, నాగాయలంక మండలాలు సాగునీటి కాలువలకు శివారున ఉండటంతో ప్రస్తుతం యంత్రాల ద్వారా వరి కోతలు చేస్తున్నారు. ఘంటసాల, చల్లపల్లి, మొవ్వ, పామర్రు, ఉయ్యూరు, గూడూరు తదితర మండలాల్లో ధాన్యం కుప్పల రూపంలో ఉంది. ప్రస్తుతం మినుము తీత పనులు వేగవంతమయ్యాయి. దీంతోపాటే రైతులు కుప్పనూర్పిళ్లు చేసి తమ వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సేవా కేంద్రాలు, మిల్లర్ల వద్దకు వెళ్తుంటే తమకు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు పూర్తయ్యాయని చెబుతున్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని మిల్లర్లు చెబుతూనే, బస్తా ధాన్యం మద్దతు ధర రూ.1,725, 1,740 ఉంటే రూ.1600 అడుగుతున్నారు. ఈ ధాన్యం మండపేట, తిరుపతి తదితర ప్రాంతాల్లోని మిల్లులకు విక్రయిస్తామని, రవాణా, ఇతరత్రా ఖర్చులు ఉన్న నేపథ్యంలో ఇంతకు మించి ధర ఇవ్వలేమని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం యంత్రాల మిగతా 6లో..

అనుమతులు ఇస్తేనే..

జిల్లాలో ఏటా నవంబరు 16వ తేదీన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి మార్చి నెలాఖరు వరకు కొనసాగిస్తారు. ధాన్యం కొనుగోళ్ల టార్గెట్ పూర్తయినా రెండో విడతలో మళ్లీ అనుమతులు ఇచ్చి మార్చి 31వ తేదీ నాటికి ధాన్యం కొనుగోళ్లను నిలిపివేస్తారు. కానీ ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికే మిల్లులకు ఇచ్చిన టార్గెట్‌లు పూర్తయ్యాయని లెక్కలు చూపి ధాన్యం కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో రైతులకు పూర్తిస్థాయిలో మద్దతు ధర లభించలేదు. మిల్లు యజమానులు, మధ్యవర్తులు నిర్ణయించిన ధరకే ధాన్యం రైతులు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రైతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

మొండి బకాయిలు

పట్టించుకోని ఉద్యోగులు

- దుర్గగుడి షాపుల అద్దె బకాయిలు రూ.1.50 కోట్లు
- నిర్లక్ష్యంగా లీజు అండ్ లీగల్ విభాగం ఉద్యోగులు
- నోటీసులతో సరి.. పేరుకుపోతున్న బకాయిలు



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం లీజు అండ్ లీగల్ విభాగంలో కొందరు ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. దేవస్థానానికి చెందిన షాపుల అద్దె బకాయిలు వసూలు చేయటంలో వీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది జనవరి వరకు సుమారు రూ.1.50 కోట్లకు బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. వీటిపై షాపుల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి.

భారీగా బకాయిలు

ఈ ఏడాది జనవరి వరకు... మహామండపం ఐదో అంతస్థులో ఉన్న షాపులు, కనకదుర్గానగర్‌లో ఉన్న షాపులతో పాటు గతంలో షాపులు నిర్వహించి అద్దెలు చెల్లించకుండా ఉన్నవి మొత్తం కలిపి రూ.1.50 కోట్ల వరకూ బకాయిలు పేరుకుపోయినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు. ఓ వైసీపీ నాయకుడు రెండు షాపులు నిర్వహించి సుమారు రూ.30 లక్షల వరకు బకాయి పడ్డట్టు తెలుస్తోంది. అతను బకాయిలు చెల్లించకుండా, మిగిలిన లీజుదారులను కూడా చెల్లించనీయకుండా చేస్తున్నాడనే విమర్శలు కూడా వస్తున్నాయి. సదరు వైసీపీ నాయకుడికి దుర్గగుడి లీజు అండ్ లీగల్ విభాగంలో పలువురు ఉద్యోగుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

వసూలులో తాత్సారం

కనీసం మొండి బకాయిలు వసూలు చేయటంలో కూడా లీజు అండ్ లీగల్ విభాగం ఉద్యోగులు తాత్సారం చేయటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షాపుల అద్దెలు రూ.1.50 కోట్ల వరకూ పేరుకుపోవటంపై దేవస్థానం ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు. అద్దెదారులకు కేవలం ఒకటి రెండుసార్లు బకాయిలు చెల్లించాలని నోటీసులిచ్చి చేతులు దులుపుకొంటున్నారు తప్ప, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. ఈ విభాగంలో పలువురు ఉద్యోగులు ఏళ్ల తరబడి విధులు నిర్వహించటం వల్ల అద్దెదారులతో లాలూచీ పడుతున్నట్లు కూడా బహిరంగంగా విమర్శలు వస్తున్నాయి. దేవదాయ శాఖ కమిషనర్, ప్రస్తుత ఈవో కె.రామచంద్రమోహన్ ప్రత్యేక దృష్టిసారించి దేవస్థానం షాపుల అద్దె బకాయిలు వసూలు చేయటానికి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

షాపు యజమానులకు లీగల్ నోటీసులు

పెద్ద మొత్తంలో బకాయిలు పడిన షాపులను నిర్వహించిన పాత యజమానులకు లీగల్ నోటీసులు సిద్ధం చేస్తున్నట్లు లీజు అండ్ లీగల్ విభాగం ఏఈవో దుర్గారావు చెప్పారు. ప్రస్తుత యజమానులకు కూడా ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, మరో దఫా కూడా నోటీసులు ఇస్తామన్నారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' అమలులో జిల్లాకు 16వ స్థానం

ర్యాంకులు ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం అమలులో కృష్ణాజిల్లాకు 16వ స్థానం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయితీరాజ్‌శాఖ నిర్వహించిన కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు శుక్రవారం సమీక్షించారు. వ్యక్తిగత, పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించడం, వ్యర్థాల నుంచి సంపద సృష్టి తదితర 14 అంశాల ఆధారంగా ర్యాంకులు కేటాయించారు. 200 పాయింట్లకు గాను జిల్లా 108 పాయింట్లతో 16వ స్థానంలో నిలిచింది.

పక్కా ప్లాన్‌తో..

ఎనికేపాడు గోడౌన్‌లో సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిజాలు

ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌కు సహకరించిన ఓ యూట్యూబర్


యూపీ గ్యాంగ్ నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపిస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఇతర పోలీసులు అధికారులు

- కీలక సూత్రధారి అతనేనని తేల్చిన పోలీసులు
- దొంగిలించిన ఫోన్లు నేపాల్‌లో విక్రయించడానికి స్కెచ్
- బిహార్‌లో పట్టుబడిన నిందితులను తీసుకొచ్చిన బెజవాడ పోలీసులు

విజయవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఎనికేపాడులోని గోడౌన్‌లో ఇన్‌గ్రాం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన యాపిల్ ఫోన్లను దొంగిలించిన కేసులో మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఆరుగురు సభ్యులున్న గ్యాంగ్‌తో చోరీ చేయించడం వెనుక ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూత్రధారి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. యూట్యూబర్‌గా ఉన్న రంజిత్ అనే యువకుడు ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ఈ గ్యాంగ్ ఇక్కడ చోరీ చేసినట్టు గుర్తించారు. ఈనెల ఐదో తేదీ అర్ధరాత్రి ఎనికేపాడులో ఉన్న గోడౌన్ నుంచి యాపిక్, వివో బ్రాండ్లకు చెందిన ఫోన్లు, యాక్సలరీస్‌ను ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్ చోరీ చేసిన విషయం తెలిసిందే. ఆ నిందితులను బిహార్ నుంచి పీటీ వారెంట్‌పై విజయవాడకు తీసుకొచ్చారు. వారి నుంచి రూ.2.52 కోట్ల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, గౌతమీషాలి, క్రైమ్స్ ఏడీసీపీ రాజారావుతో కలిసి కమిషనరేట్‌లోని సమావేశపు హాల్లో శుక్రవారం వెల్లడించారు.

గ్యాంగ్‌గా కలిసి..

ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్ జిల్లా జలాల్‌పూర్‌కు చెందిన దీప్‌చంద్ర ప్రజాపతి, సునీల్ కుమార్ సరోజ్, బ్రిజేష్ కుమార్ ఉగ్రా, సుంగున్‌పూర్‌కు చెందిన మాయా జైప్రకాష్ పటేల్, బస్సారా గ్రామానికి చెందిన మిథిలేష్ కుమార్, బోడిపూర్‌కు చెందిన సురేంద్ర కుమార్ పటేల్ స్నేహితులు. ప్రజాపతి ఇంటర్ వరకు చదువుకుని సొంతంగా కారు ట్రావెల్స్ ఏర్పాటు చేసుకున్నాడు. యూపీ62సీకే 1404 కారు నడుపుతున్నాడు. జై ప్రకాష్ మిగతా 6లో..

పైసలిస్తేనే పాస్‌పోర్టు వెరిఫికేషన్

- అక్రమార్జనే ధ్యేయంగా ఓ పోలీసు అధికారి
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో చుక్కలు
- అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక కొర్రీ పెట్టి డబ్బు వసూళ్లు 8లో

రైతులను ఆదుకుంటాం

- మార్కెటింగ్ శాఖ ఆర్డీడీ లావణ్య
- మోపిదేవిలో క్యాబేజీ తోటల పరిశీలన 6లో

బాతు కోసం చెరువులో దిగి బాలుడు మృతి

6లో

గాల్లో ప్రాణాలు!





అత్యవసర సమయంలో అందని వైద్యం

- అందుబాటులో లేని ట్రామా కేర్ యూనిట్లు
- నందిగామ, జగ్గయ్యపేటల్లో భారీగా పరిశ్రమలు
- క్వారీలు, క్రషర్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి
- ప్రమాదాలు జరిగితే చాలా సమస్యలు

కొద్ది నెలల క్రితం జగ్గయ్యపేట ప్రాంతంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరగ్గా, పదిమందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వైద్యం కోసం బాధితులను 90 కిలోమీటర్లకు పైగా దూరంలో విజయవాడ తరలించాల్సి వచ్చింది.

కంచికచర్ల మండలం పరిటాల పరిధిలోని రాతి క్వారీల్లో, క్రషర్లలో తరుచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి. వైద్యం కోసం క్షతగాత్రులను విజయవాడ తరలించటం తప్పితే దగ్గర్లో తగిన సదుపాయాలతో కూడిన ఆసుపత్రి లేదు.

నందిగామ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో రాష్ట్ర సరిహద్దు గరికపాడు నుంచి కంచికచర్ల వరకు జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహన ప్రమాద బాధితులకు సకాలంలో మెరుగైన వైద్యం అందటం లేదు.

ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంట (గోల్డెన్ అవర్) ఎంతో విలువైనది. బాధితులు, క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందని పక్షంలో ప్రాణాలకు ప్రమాదం. దగ్గర్లో ట్రామా కేర్ యూనిట్ ఉంటే ప్రాణాలు కాపాడవచ్చు.

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల)

నందిగామ, జగ్గయ్యపేటల్లో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ఏలికలు తగిన శ్రద్ధ చూపటం లేదు. ప్రధానమైన ఏరియా ఆసుపత్రులు, రిఫరల్ ఆసుపత్రులుగా ఉన్నాయి తప్పితే గాయాలపాలై నెత్తురోడుతున్న వారికి, కాళ్లు, చేతులు విరిగిన వారికి వైద్యం అందించలేకపోతున్నాయి.

సరిహద్దులో ప్రమాదాలు..

తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గరికపాడు నుంచి విజయవాడ 90 కిలోమీటర్లు. ఈ 65వ నెంబరు జాతీయ రహదారి జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేసినప్పటికీ ఇటీవల కాలంలో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. హైస్పీడ్ వాహనాలు అందుబాటులోకి రావటంతో ప్రమాదాల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటున్నది. గ్రామీణ ప్రాంతాల రోడ్లు కూడా నెత్తురోడుతున్నాయి. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతుండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల ప్రమాదాలకు కొదవ లేదు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రతి ఏడాది లెక్కకు మించి ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో క్షతగాత్రుల సంఖ్య వందలు దాటుతున్నది. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో పలు సిమెంట్ కార్మాగారాలు, ఫార్మా అండ్ కెమికల్స్ ఫ్యాక్టరీలు, పదుల సంఖ్యలో రాతి క్వారీలు, క్రషర్లతో పాటుగా ఇతరత్రా పలు కార్మాగారాలు, సంస్థలు ఉన్నాయి. ప్రమాదం తర్వాత క్షతగాత్రులకు మొదటి గంట ఎంతో విలువైనది. సకాలంలో మెరుగైన వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే గరికపాడు నుంచి విజయవాడ మధ్యలో ఎక్కడా ట్రామాకేర్ సెంటర్ లేదు. నందిగామ, జగ్గయ్యపేటల్లో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ట్రామాకేర్ సెంటర్లలో మెరుగైన వైద్యానికి సంబంధించి అన్ని సదుపాయాలు ఉంటాయి. క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్యం అందుతుంది. దాదాపుగా దశాబ్దం క్రితం జగ్గయ్యపేటలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటుగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు స్వామి రామానంద ట్రస్టు ముందుకొచ్చింది. అప్పట్లో జిల్లా అధికారులు తగిన స్థలం కూడా పరిశీలించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేక ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.

రిఫరల్ ఆసుపత్రులుగా ఏరియా ఆసుపత్రులు నియోజకవర్గ కేంద్రాలైన నందిగామ, జగ్గయ్యపేట పట్టణాల్లో వైద్య విధానపరిషత్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రులు నడుస్తున్నాయి. ఈ రెండు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసదుపాయలు లేవు. ఆర్థోపెడిక్ వైద్యులున్నప్పటికీ తగిన ఆధునాతన ఎక్విప్‌మెంట్ లేనందున ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందటం లేదు. నాలుగు కుట్లు వేసి, ప్రథమ చికిత్స చేసి విజయవాడ రిఫర్ చేస్తున్నారు. దీంతో ఏరియా ఆసుపత్రులు రిఫరల్ ఆసుపత్రులుగా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. విజయవాడ తీసుకువెళ్లే లోగా పుణ్యకాలం కాస్తా గడిచిపోతున్నది.

పాలకులు స్పందించాలి

ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు విషయంలో పాలకులు, ఉన్నతాధికారుల ఆలోచన దృక్పదం మారాలి. జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను పోలీస్, రవాణాశాఖ, జాతీయ రహదారుల శాఖ అధికారులు గుర్తిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకునేందుకు రోడ్డు భద్రతా కమిటీ పలు సూచనలు చేస్తున్నది. అయితే ఎంతో ప్రాధాన్యత కల్గిన ట్రామా కేర్ సెంటర్ల గురించి మాత్రం ఎందుకు ఆలోచించటం లేదో అర్థం కావటం లేదు. క్షతగాత్రులకు వైద్యం అందించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. కాగా నందిగామలో ఆధునిక వసతులతో కూడిన వంద పడకల ఆసుపత్రికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 34.48 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఇందులో ట్రామా కేర్ సెంటర్ కూడా ఉందని అంటున్నారు.

పక్కా ప్లాన్‌తో..

(5వ పేజీ తరువాయి)

కూలీ పనులు చేసుకుంటూ చోరీలు చేసేవాడు. అతడిపై ఎక్కడా కేసులు నమోదు కాలేదు. సునీల్‌కుమార్ సరోజ్, బ్రిజేష్ కుమార్ ఉగ్రా ఆర్టీవో కార్యాలయంలో ఏజెంట్లు పనిచేస్తున్నారు. ఇద్దరూ కలిసి చోరీలు చేసేవారు. సురేంద్ర కుమార్ పటేల్ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆరుగురు కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు.

రంజిత్ ఎక్కడ?

ఈ ఆరుగురిలో ప్రజాపతి ఓ ప్రతిపాదన చేశాడు. తన కారులో వివిధ రాష్ట్రాలు తిరుగుతూ చోరీలు చేద్దామని, దానికయ్యే ఇంధనం ఖర్చును మిగిలిన ఐదుగురు భరించాలని చెప్పాడు. దీంతోపాటు కాజేసిన సొత్తును విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తంలో వాటా ఇవ్వాలని ప్రతిపాదించాడు. దీనికి మిగిలిన వారంతా అంగీకరించారు. ఈ తరుణంలో యూపీకి చెందిన యూట్యూబర్ రంజిత్ వారికి పరిచయమయ్యాడు. సాంకేతికంగా నైపుణ్యంగా ఉన్న అతడు ఈ గ్యాంగ్‌కు ఎనికేపాడులో ఉన్న గోడౌన్ లొకేషన్ ఇచ్చాడు. అందులో సెల్‌ఫోన్లు ఉంటాయని, వాటిని కాజేసి తీసుకొస్తే నేపాల్‌లోని ఖాట్మండులో విక్రయించేద్దామని ప్రతిపాదించాడు.

సరిహద్దులు దాటితే చాలనుకుని..

నిందితులకు స్కెచ్ ఇచ్చిన రంజిత్ ఇంకా అనేక విషయాలు వివరించాడు. సరుకుతో ఆంధ్రా సరిహద్దు దాటేయండి, ఆ తర్వాత ఎవరూ పట్టుకోలేరని చెప్పాడు. సెల్‌ఫోన్ల చోరీని ఆంధ్రా పోలీసులు పెద్దగా పట్టించుకోరని సలహా ఇచ్చాడు. దీంతో ఈ ఆరుగురు ఎనికేపాడులోని గోడౌన్‌లో చోరీ చేసి వెళ్లిపోతుండగా, బిహార్ సరిహద్దులో సాసారం వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారిని అక్కడ కోర్టులో హాజరుపరిచాక పీటీ వారెంట్‌పై ఇక్కడికి తీసుకొచ్చారు. బిహార్ పోలీసులు విచారించినప్పుడు తమ వెనుక సురేంద్రకుమార్ అనే వ్యక్తి ఉన్నాడని చెప్పిన నిందితులు విజయవాడ పోలీసులకు రంజిత్ పేరును వెల్లడించారు.

22 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ఉంగుటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెదఅవుటపల్లిలో ఈనెల 22 నుంచి ఉమ్మడి కృష్ణా(ఎన్టీఆర్, కృష్ణా)జిల్లాల స్థాయిలో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు కమిటీ చైర్మన్ గుదె ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఔత్సాహికులైన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9052266216, 9182771744, 9948059873లో సంప్రదించాలన్నారు.

సానుభూతి కరువు

(5వ పేజీ తరువాయి)

హయాంలో చంద్రబాబు కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వంశీపై ఇప్పటికే తప్పు చేశారన్న ముద్ర ఉంది. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి సరైనది కాదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. దీంతో ఆయన అరెస్టుపై వైసీపీ నుంచి కూడా పెద్దగా స్పందన రావట్లేదు. వంశీ అరెస్టయ్యాక కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చినప్పుడు జిల్లాకు చెందిన ఒకరిద్దరు చోటా నేతలు వచ్చారే తప్ప పెద్దగా ఎవరూ కనిపించలేదు. ఈ అరెస్టుపై వైసీపీ శ్రేణులు కూడా గొంతెత్తలేకపోతున్నాయి.

కార్యకర్తలే పావులుగా..

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో కీలక సూత్రధారి వంశీనే. ఈ దాడికి ఆయన పథక రచన చేయటం, దానిని స్వయంగా సమీక్షిస్తూ అమలు చేయటం వంటి పరిణామాల్లో అప్పట్లో ఉత్సాహంగా పాల్గొన్నా.. అది తప్పన్నది చాలామంది కార్యకర్తలు అనుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోయాక అప్పట్లో దాడిలో పాల్గొన్న వారంతా ఇప్పుడు ఊచలు లేకబెట్టాల్సి వస్తుండటంతో వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. వంశీ అండ్ గ్యాంగ్ వ్యవహారాల్లో తలదూర్చిన పాపానికి ఆ పార్టీకి చెందిన సామాన్య కార్యకర్తలు కూడా అరెస్టు కావాల్సి వచ్చింది. ఆరోజు అధికారం ఉంది కదా.. అని వంశీ అండ్ గ్యాంగ్‌కు సహకరించిన వారికి ఇప్పుడు చట్టం ద్వారా శిక్ష పడింది. చాలామంది కుటుంబాలకు దూరంగా అజ్ఞాతంలో ఉంటున్నారు. వారిని కూడా పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేస్తుండటంతో బెయిల్ కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వంశీ అరెస్టు నుంచి కోర్టు రిమాండ్ విధించడం వరకూ శుక్రవారం రోజంతా సమయం పట్టినా ఎక్కడా హడావిడి జరగలేదు. వంశీని చూడటానికి శుక్రవారం నాయకులెవరూ సబ్‌జైలుకు రాకపోవడం ఈ పరిణామాలకు ఊతమిస్తోంది.

వంశీని కఠినంగా శిక్షించాలి

» దళిత సంఘాల నేతల నిరసన

అవనిగడ్డ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎస్సీ యువకుడు సత్యవర్ధన్‌ను నిర్బంధించి వేధించిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీని కఠినంగా శిక్షించాలని అవనిగడ్డలో దళిత సంఘాలు నిరసన చేపట్టాయి. శుక్రవారం నేరెళ్లపాలెంలోని బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ఎస్సీ నేతలు నివాళులర్పించి అనంతరం వంశీని కఠినంగా శిక్షించాలంటూ నిరసన తెలియజేశారు. వైసీపీ పాలనలో దళితులపై యథేచ్ఛగా దాడులు జరిగాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా వైసీపీ నేతలు తమ ధోరణిని మార్చుకోకుండా దళితులపై దాడులు కొనసాగిస్తారనటానికి గన్నవరం ఉదంతమే ఉదాహరణ అని దళిత సంఘాల నేతలు అన్నారు. సత్యవర్థన్, అతని కుటుంబసభ్యులను వంశీ హైదరాబాద్ తీసుకెళ్లి ఓ ఫామ్‌హౌస్‌లో నిర్బంధించి నాలుగు రోజులపాటు చిత్రహింసలు పెట్టి కోర్టులో వాంగ్మూలాన్ని మార్చి చూపించారని, అలాంటి వ్యక్తి బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేయటంతోపాటు వారికి రక్షణ కూడా లేకుండాపోతుందని, విచారణ పూర్తయ్యే వరకు వంశీని రిమాండ్‌లోనే ఉంచి ఆయనను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కైతేపల్లి కృష్ణారావు, పులవర్తి దేవదాస్, బందెల సుబ్బారావు, మునిపల్లి రాంబాబు, నలుకుర్తి అశోక్, నలుకుర్తి చంద్రశేఖర్, పైడిపాముల శేఖర్, కొల్లూరి రాజశేఖర్, నలుకుర్తి నగధర్, బందెల ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



క్యాబేజీ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీడీ లావణ్య

రైతులను ఆదుకుంటాం

» క్యాబేజీ తోటలను పరిశీలించిన ఉద్యాన అధికారులు

మోపిదేవి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : క్యాబేజీ సాగు రైతులకు ఏ విధమైన నష్టం వాటిల్లకుండా అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సి.లావణ్య తెలిపారు. [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] 'పంటకు కష్టం - రైతుకు నష్టం' శీర్షికన క్యాబేజీ పంటపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనంపై మార్కెటింగ్, ఉద్యానశాఖాధికారులు పంట పరిశీలనకు మోపిదేవి విచ్చేశారు. వార్పు వద్ద ట్రాక్టర్‌తో దున్నివేసిన క్యాబేజీ తోటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివిసీమ ప్రాంతంలో కూరగాయలు, వాణిజ్య పంటలు లంక గ్రామాల్లో అధికంగా సాగు చేస్తారన్న విషయం తెలుసన్నారు. ప్రస్తుతం క్యాబేజీ, టమాట వంటి పంటలకు ధర, కొనుగోలు మందకొడిగా ఉన్న విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదన్నారు. రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట దున్నివేయటం బాధాకరమన్నారు. మండలంలో క్యాబేజీ దిగుబడిని అమ్ముకునేందుకు వారికి అనుకూలమైన రైతు బజారుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మచిలీపట్నం, గుడివాడ, విజయవాడ, రాజమండ్రి రైతు బజార్లకు తీసుకెళ్లి పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. రైతులు ముందుగా సమాచారం అందించి వారే పంటను అమ్ముకోవచ్చునని తెలిపారు. కృష్ణా జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఎల్.నిత్యానందం, ఉద్యాన శాఖాధికారి ఎస్.రమేష్, అవనిగడ్డ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి కె.ఆనంద్, రైతులు గద్దె శ్రీహరి, సింహాద్రి రంజిత్ బాబు, సచివాలయ ఉద్యాన శాఖ సహాయకులు బాలాజీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టీడీపీ పరిశీలకురాలిగా నూకానమ్మ



నందిగామ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నందిగామకు చెందిన బీసీ మహిళా నాయకురాలు యలగాల నూకానమ్మను గుడివాడ నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పని చేసి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తగా బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకుగాను మచిలీపట్నం పార్లమెంటు సమన్వయకర్తగా బండి రామకృష్ణను నియమించారు. 2024 ఎన్నికల్లో అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని జనసేన రాష్ట్ర అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ బాధ్యతలు అప్పగించినట్టు రామకృష్ణ మీడియాతో తెలిపారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను సమన్వయపరుస్తూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి కృషి చేస్తామని రామకృష్ణ తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకుని కూటమి అభ్యర్థి విజయానికి సహకరించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

బాతు కోసం చెరువులో దిగి బాలుడు మృతి



గిరీష్ (ఫైల్)

కోడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బాతు కోసం చెరువులో దిగిన బాలుడు మృతి చెందిన సంఘటన కోడూరు మండల పరిధిలోని మందపాకల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చలపతి ఆదిశేషు కుమారుడు గిరీష్ (13) గురువారం పాఠశాల నుంచి సాయంత్రం వచ్చి ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న చెరువులో తిరుగుతున్న బాతును పట్టుకునేందుకు దిగాడు. చెరువు లోతుగా ఉండటంతో గిరీష్ నీటిలో మునిగిపోయాడు. స్థానికులు గిరీష్‌ను వెలికి తీసి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. ఆడుతూ అందరినీ పలుకరిస్తూ ఉండే బాలుడు హఠాత్తుగా మృతి చెందటంతో మందపాకల గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.



పాఠశాల వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హైస్కూల్‌గా ప్రమోట్ చేయాలని నిరసన

కోడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి ఎంపీయూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా ప్రమోట్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. శుక్రవారం విశ్వనాథపల్లి పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పాఠశాలలో 103 మంది విద్యార్థుల్లో ఐదో తరగతి లోపు 54 మంది, ఐదో తరగతి పైబడి 49మంది ఉన్నారని తెలిపారు. 49మందిని వి.కొత్తపాలెం హైస్కూల్ పాఠశాలలోకి బదిలీచేస్తూ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. పిల్లలు మూడు కిలోమీటర్ల మేర వి.కొత్తపాలెం వెళ్లాల్సి వస్తున్నదని, ప్రైవేట్ పాఠశాలలకు పంపించి చదివించలేకే ఇక్కడ చదివిస్తున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థనలను గుర్తించి విశ్వనాథపల్లి పాఠశాలను హైస్కూల్‌గా మార్చాలని వారు కోరారు.



ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు, పిల్లలతో తల్లిదండ్రులు

ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో 5500 మంది పిల్లలకు గుండె చికిత్సలు

» డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

భారతీనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తమ ఆసుపత్రిలో ఇప్పటివరకు 5500 మంది పిల్లలకు గుండె సంబంధిత చికిత్సలు అందించినట్టు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. రమేష్ హాస్పిటల్‌లో చిన్నిపిల్లల గుండెజబ్బుల వైద్యవిభాగం ఆధ్వర్యంలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సులో చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ జ్యోతి ప్రకాష్ రెడ్డి, డాక్టర్ కత్తుల అనూష, డాక్టర్ భరత్ సిద్ధార్థ పాల్గొన్నారు. అనంతరం చికిత్స పొందిన పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ, చిన్నపిల్లలకు గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయడం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అన్నారు. ఇది అధునాతన వైద్య పరికరాలు, నైపుణ్యం, సమగ్రమైన టీంవర్క్ అవసరమయ్యే చికిత్సల్లో ఒకటిగా గుర్తించబడిందన్నారు. హాస్పిటల్‌లో ప్రత్యేక చిన్నపిల్లల గుండె వైద్యవిభాగం ఇప్పటివరకు 5500 మంది పిల్లలకు గుండె సంబంధిత చికిత్సలు అందించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిందన్నారు.కార్యక్రమంలో గుండె జబ్బులకు శస్త్రచికిత్సలు, డివైస్ చికిత్సలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు మొత్తం 100 మంది పాల్గొని వారి అనుభవాలను తెలిపారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ చీఫ్ ప్రొక్యూర్మెంట్ ఆఫీసర్ మహేంద్రబాబు, సీనియర్ వైద్యనిపుణులు డాక్టర్ వసుంధరాదేవి, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ రాజు పాల్గొన్నారు.

కోటి ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

పట్టాలెక్కించారు. ఈ కేసులో అరెస్టు చేసిన నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసులో సత్యవర్ధన్ సోదరుడు కిరణ్ ఫిర్యాదుదారుడిగా ఉన్నాడు. ఇదికాకుండా క్రైం నెంబరు 84/2025తో మరో కేసును పోలీసులు నమోదు చేశారు. టీడీపీకి చెందిన బీసీ, ఎస్సీ, మైనారిటీ నాయకులు చేసిన ఫిర్యాదుపై ఈ కేసును నమోదు చేశారు. ఒక కేసులో అరెస్టులు కొంత వరకు జరగడంతో, రెండో కేసును పోలీసులు పైకి తీస్తారా లేదా అనే ప్రశ్న వస్తోంది. ఓపక్క మొదటి కేసులో మిగిలిన నిందితుల కోసం వేట సాగిస్తున్న పోలీసులు, ప్రధాన నిందితుడు వంశీని కస్టడీలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో శుక్రవారం దాఖలు చేశారు. వాస్తవానికి వంశీతో పాటు మిగిలిన ఇద్దరు నిందితులను పోలీసులు నాల్గో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కస్టడీ పిటిషన్‌ను పోలీసులు ఈ కోర్టులోనే దాఖలు చేయాల్సి ఉంటుంది. వంశీ కేసులో అట్రాసిటీ సెక్షన్లు ఉండటంతో కస్టడీకి ఇవ్వాలా వద్దా అనే నిర్ణయాన్ని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు నిర్ణయిస్తుంది. ఈ కారణంగా పోలీసులు కస్టడీ పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో దాఖలు చేశారని తెలుస్తోంది. వంశీ అరెస్టు ప్రభావంతో కేసులో ఉన్న నిందితులు రాష్ట్ర సరిహద్దులు దాటినట్టు ప్రచారం జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానంతో వారి ఆచూకీని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

అవినీతి కొండలు

(5వ పేజీ తరువాయి)

అడ్డగోలుగా తవ్వేశారు. మల్లవల్లి గ్రావెల్‌ను గుడివాడ, బందరుకు భారీ ఎత్తున తరలించారు. పోర్టు పనుల పేరుతో భారీ ఎత్తున గ్రావెల్‌ను తవ్వుకుపోయారు.

ముస్తాబాద, చనుపల్లివారిగూడెం కొండలపై కన్ను

గన్నవరం మండలం పరిధిలోనే ముస్తాబాద, చనుపల్లివారిగూడెం కొండలను కూడా వంశీ అనుయాయులు అనధికారికంగా చేజిక్కించుకున్నారు. ఈ కొండల తవ్వకాలపై స్థానికులు అభ్యంతరాలను వ్యక్తంచేసినా పెడచెవిన పెట్టారు. అర్ధరాత్రి సమయంలోనే కొండలను పిండిచేశారు. లక్షల క్యూబిక్ మీటర్ల మేర గ్రావెల్‌ను తన్నుకుపోయారు.

మామిడి తోటలను మాయం చేశారు

గ్రావెల్ నిక్షేపాలు కలిగిన మామిడి తోటలను కూడా వంశీ అనుచరులు వదల్లేదు. రంగన్నగూడెం, సింగన్నగూడెం గ్రామాల్లోని మామిడి తోటల నేలలు గ్రావెల్‌తో కూడుకుని ఉండటం వల్ల వాటిని కూడా వంశీ అనుయాయులు వాటాల ప్రాతిపదికన చేజిక్కించుకుని తవ్వేశారు. దాదాపు 15 మీటర్ల మేర గ్రావెల్‌ను తవ్వేసి సొమ్ము చేసుకున్నారు.



అక్రమ తవ్వకాల అనంతరం వీరవల్లి చెరువు

డీ పట్టాలనూ వదల్లేదు

గన్నవరం నియోజకవర్గంలో పేదలకు ఇచ్చిన సాగు పట్టాలను, ప్రజలు ఆక్రమించుకున్న భూములు ఏమైనా ఉంటే వాటిని కూడా తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. ఇలా తీసుకున్న భూముల్లో మట్టిని అడ్డగోలుగా తవ్వేశారు. కొండపావులూరులో సర్వే నెంబర్ 33, 34, 62లో పెద్దసంఖ్యలో భూములను లీజుకు తీసుకుని 35 మీటర్ల లోతున మట్టిని తరలించారు. మట్టిని ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకున్నారు.

ధాన్యం దయనీయం

(5వ పేజీ తరువాయి)

ద్వారా వరికోతలు పూర్తి చేస్తున్న కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం మండలాల్లోని ధాన్యం ఇతర జిల్లాలకు విక్రయించాలంటే ధాన్యంలో తేమశాతం సాకుగా చూపి బస్తాకు రూ.1,350 నుంచి 1400 మించి ధర ఇవ్వలేమని రైతులతో మిల్లర్లు, మధ్యవర్తులు బేరాలకు దిగుతున్నారు.

మిల్లులకు కొసరి కొసరి వడ్డింపులు

మినుము సాగు అధికంగా జరిగిన మండలాల్లో రైతులు వరి పంటను కోతకోసి కుప్పలుగా వేసి ఉంచారు. ప్రస్తుతం జిల్లాలో కుప్పల రూపంలో నాలుగు లక్షల టన్నుల ధాన్యం ఉంది. ఈ ధాన్యం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వం మిల్లులకు టార్గెట్‌లు పెంచాల్సి ఉంది. జిల్లాలో నాలుగు లక్షల టన్నుల ధాన్యం కుప్పల రూపంలో ఉందని, ఈ ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ గీతాజలి శర్మ పౌరసరఫరాల సంస్థ ఎండీకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన పౌరసరఫరాలసంస్థ ఉన్నతాధికారులు జిల్లా నుంచి కేవలం 30వేల టన్నులను కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ 30వేల టన్నుల ధాన్యానికి సంబంధించిన కొనుగోళ్ల టార్గెట్‌లను కొసరి కొసరి మిల్లులకు కేటాయించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

కంకిపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న మాలకొండయ్య కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీ రూ. 80 వేలుని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బోడె మనోజ్ మాట్లాడుతూ, పేదలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వంగూరు పవన్, రావి రాకేశ్, బొంగరాల అబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్

సర్వీసు రోడ్డుపైనే వ్యాపారం!

- గండిగుంట గ్రామపరిధిలో యథేచ్ఛగా ఇసుక, కంకర విక్రయాలు
- వాహన రాకపోకలకు ఇబ్బంది
- తరచూ ప్రమాదానికి గురవుతున్న ద్విచక్రవాహనదారులు
- పట్టించుకోని అధికారులు

(ఉయ్యూరు- ఆంధ్రజ్యోతి)

గండిగుంట గ్రామపరిధిలో జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డుపై కొందరు ఇసుక, కంకర గుట్టలు పోసి వ్యాపారం చేయడంతో వాహనాల రాక పోకలకు ఇబ్బంది కలుగుతుంది కాటూరు రోడ్డు ఫ్లైఓవ ర్ సమీపాన గండిగుంట వైపు వెళ్లే సర్వీసు రోడ్డుపై పెద్ద పెద్ద కంకర గుట్టలు, ఇసుక గుట్టలు పోసి వ్యాపారం చేస్తూ వాహనాల రాక పోకలకు ఆటంకం కలిగిస్తున్నారు. ఉయ్యూరులో వీరమ్మ తిరునాళ్ల జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ మళ్లించి విజయవాడ వైపు వెళ్లే బస్సులు, ఆటోలు ఇతర వాహనాలు సర్వీసు రోడ్డువైపు పంపుతున్నారు. ఈ క్రమంలో సర్వీసు రోడ్డుపై పోసిన ఇసుక కంకర గుట్టల వల్ల వాహనాలు నడిపేవారు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ఇసుకలో జారిపడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సర్వీసు రోడ్డుపై గుట్టలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.



జాతీయ రహదారి కాటూరు రోడ్డు ఫ్లైఓవర్ సమీపాన సర్వీసు రోడ్డు ఆక్రమించి పోసిన ఇసుక, కంకర గుట్టలు



జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావుకు స్వాగతం పలుకుతున్న ఎంఈవో రాంబాలాసింగ్, ఏపీ మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ రవిసాగర్

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

- జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధించగలరని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు విద్యార్థులకు సూచించారు. రేమల్లెలో ని శ్రీవిజ్ఞాన్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ రవిసాగర్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ యోగా లాంటి వాటి ద్వారా ఏకాగ్రతతో చదువడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలు పొందవచ్చని సూచించారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, ప్రీస్కూల్ చిన్నారులకు పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంబాలాసింగ్, ప్రిన్సిపాల్ సొంగోజు పూర్ణచంద్రరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

పెనమలూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : తాడిగడప మనోజ్‌నగర్ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి సేవాసమితి సభ్యులు తెలిపారు. ఉదయం ఐదుగంటలకు కాకడ హారతి, పంచామృతాభిషేకంలతో ప్రారంభించి మధ్యాహ్నం స్వామివారి పల్లకీ సేవతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



జంక్షన్‌లో పోలీస్ కవాతు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌ను అరెస్టు చేసిన నేపథ్యంలో జంక్షన్‌లో పోలీస్, పారా మిలటరీ సిబ్బంది కవాతు నిర్వహించారు. వంశీ అరెస్టు నేపథ్యంలో అల్లర్లు జరగకుండా ముందస్తు హెచ్చరికగా జంక్షన్‌లో కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు నాలుగు రోడ్లలో సాగింది. సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సైలు వి.సురేశ్, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు కవాతును నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా యనమలకుదురు సబ్ స్టేషన్ పరిధిలోని లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నేడు ఉదయం 8గంటల నుంచి 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు గుణదల ఈఈ హరిబాబు తెలిపారు. బోసు బొమ్మ సెంటరు, సంజీవనగర్, లంబాడీపేట, డబ్బాపంపు రామాలయం, అవనిగడ్డ కట్ట ఏరియావాసులకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కంకిపాడు : మండలంలోని మద్దూరు, ఉప్పలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కంకిపాడు ఏఈ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పలూరు, మంతెన, మద్దూరు, గొడవర్రు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అంగన్వాడీలకు శిక్షణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :చిన్నారులకు పోషకాహార లోప ప్రభావం లేకుండా అంగన్వాడీలు వెయ్యిరోజుల ప్రణాళిక అమలు పరచాలని ఐసీడీఎస్ నోడల్ అధికారి భానుమతి అన్నారు. పోషన్ బీ పడాయి బీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయంలో రెండవ రోజు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా అంగ వైకల్యాన్ని దూరం చేయవచ్చని దీనిపై తల్లిదండ్రు లకు అవగాహన కల్పించాలని డాక్టర్ గోపీచంద్ అన్నారు. కంకిపాడు సీడీపీఓ బేబీ సుకన్య, సూపర్ వైజర్లు సరోజిని కళ్యాణి పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం తగ్గించుకోవాలి

గన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అవసరానికి మించి పురుగు మందులు వాడితే భూసారం తగ్గడంతో పాటు పంట నాణ్యత తగ్గుతుందని జిల్లా వనరుల కేంద్రం అధికారులు తెలిపారు. మండలంలోని తెంపల్లిలో మినుము పంటను శుక్రవారం జిల్లా వన రుల కేంద్రం బృంద సభ్యులు జ్యోతి రమణి, శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. గెలుపు గురించి దేశంలో, రాష్ట్రంలో చర్చించుకునే స్థాయిలో భారీ మెజార్టీ సాధించాలని కోరారు. శుక్రవారం స్థానిక స్రవంతి పాఠశాలలో కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్ (డెమొక్రటిక్) ఆధ్వర్యంలో ప్రవేట్ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థిని గెలిపించిన విషయాన్ని వెంకట్రావు గుర్తు చేశారు. ఉపాధ్యాయులు కన్న గొప్పవారు ఎవరూ లేరని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 7నెలల కాలంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, కూటమి పాలనకు ఈ ఎన్నికలు ఒక పరీక్ష అని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆలపాటిని పెద్దల సభకు పంపించాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వడ్లాణం హరిబాబు నాయుడు, కోట వీరబాబు, కూటమి నాయకులు చిగురుపాటి కుమారస్వామి, చలమలశెట్టి రమేష్‌బాబు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఫణికుమార్, బోడపాటి రవికుమార్, మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఈడుపుగల్లులో..

కంకిపాడు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లులో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేపట్టాల్సిన వ్యూహంపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల వారీగా ఉన్న ఓటర్లను ఇంటింటికి వెళ్లి కలవాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ప్రతి పది మందికి ఒక కార్యకర్త కలిసే విధంగా కార్యచరణ రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, షేక్ షకార్ తదితరులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లులో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఇతర నాయకులు



బస్టాండ్ ఆవరణలో రిలేదీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్టీసీ కార్మికుల రిలేదీక్షలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా జరిగిన చార్ట్ కౌన్సెలింగ్ రద్దుచేసి కేంద్ర కార్యాలయం సర్క్యులర్ అమలు చేయాలని కోరుతూ ఉయ్యూరులో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు శుక్రవారం రిలేదీక్షలు చేపట్టారు. అసోసియేషన్ నాయకుడు మురళీకృష్ణ మాట్లాడుతూ, చార్ట్ కౌన్సెలింగ్‌లో డిపో మేనేజర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పక్షపాత వైఖరితో మొండి వైఖరి అవలంభిస్తున్నారని, ఒక అసోసియేషన్‌కు ప్రయోజనం చేకూరేలా చార్ట్ కౌన్సెలింగ్ నిర్వహించారని ఆరోపించారు. చార్ట్ కౌన్సెలింగ్‌ను వ్యతిరేకిస్తూ 60మంది ఉద్యోగులు ఇచ్చిన రిప్రజెంటేషన్ పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఎండీ ఉమర్, షఫీ దీక్షలో పాల్గొన్నారు. అసోయేషన్ జోనల్ సెక్రటరీ రామారావు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

గన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని ఎంఏవో వై.రజని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్దకు ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకుని వెళితే మూడు సార్లు ఓటీపీ వస్తుందని చెప్పారు. ఓటీపీలు చెప్పిన తరువాత ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. ఇప్పటి వరకూ 800 మందికి పైగా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మిగిలిన రైతులు కూడా త్వరితగతిన చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుకు ఆధార్ నెంబర్ లాగా 11 సంకెల గల యూనిక్ ఐడీ వస్తుందన్నారు. దాని ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యవ సాయ పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ పెరుగుతుంది. ఈ నెల 8న ప్రారంభమై 15 రోజులపాటు జరిగే తిరునాళ్ల శుక్రవారంకు 7వ రోజుకు చేరుకోగా అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. గొర్రె పొటేళ్లు, పసుపు కుంకుమ, చీర సారెలతో వేడుకగా తరలివచ్చి పొంగళ్ల నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఎంపీడీవో శేషగిరిరావు, కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రసాదం, తాగునీరు పంపిణీని తహసీల్దార్ సురేశ్‌కుమార్ ప్రారంభించారు.

- తిరునాళ్ల సందర్భంగా వీరమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు, పరిస్థితిని తహసీల్దార్ సురేశ్‌కుమార్ పరిశీలించారు. తిరునాళ్లలో సౌకర్యాలను భక్తులను అడిగి తెలుసుకుని ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.



అమ్మవారికి గొర్రెపొటేళ్లతో మొక్కుతీర్చుకుంటున్న భక్తులు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పెనమలూరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : కింది పోర్షన్‌లో విద్యుత్ పనులు జరుగుతుండగా విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి సెంటరులో గోగినేని నాగభూషణం(40)తన కుటుంబంతో నివసిస్తున్నాడు. తాను నివాసముండే ఇంటికి క్రిందిభాగంలో షాపునకు అద్దెకు తీసుకున్న రాజేష్ అనే వ్యక్తి గురువారం షాపునకు సంబంధించిన లైటింగ్ బోర్డును ఏర్పాటు చేస్తుండగా నాగభూషణానికి విద్యుత్ తీగలు తగిలి అతడు అక్క డికక్కడే మృతి చెందాడు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గడ్డి ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడి ..

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని ఆర్వోబీపై వెళుతున్న గడ్డి ట్రాక్టర్ ప్రమాదానికి గురి కాగా గడ్డి మీద కూర్చున్న కానుమోలు గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం అప్పారావుపేట గ్రామం నుంచి నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి ట్రాక్టర్‌పై గడ్డిని రవాణా చేస్తుండగా ఆర్వోబీ వద్దకు రాగానే ట్రక్కు అదుపు తప్పి వంతెన రైలింగ్ మీద ఒరిగిపోయింది. దీంతో గడ్డిలోడు మీద కూర్చున్న కూలీ కూరపాటి భూణేశ్ (28) అదుపు తప్పి వంతెన పైనుంచి కింద సర్వీసు రోడ్డు మీదపడి తీవ్రగాయాలకు గురయ్యాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న భూణేశ్‌ను చిన్నఅవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గ్రిగ్ మెమోరియల్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఈడుపుగల్లు జెడ్పీ విద్యార్థులు

ఈడుపుగల్లు, కంకిపాడు విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ జడ్పీ పాఠశాలలో జరిగిన గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈడుపుగల్లు పాఠశాల బాలికల విభాగంలో దీప్తి పి. దుర్గాభవాని, గాయత్రి, వి, దివ్య, ఎస్ జీవన్, ఎ. లాస్య, ఆర్ భారతి కె. దేవి శ్రీ సాయి, ఈశ్వరి వివిధ విభాగాల్లో గెలుపొందారు. గోగినేని పాలెంలో జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో పి. బాబు, హర్ష, కె. ధనుష్, పి. రామానాయుడు వివిధ విభాగాల్లో గెలుపొందారు. అదే విధంగా కంకిపాడు జెడ్పీ విద్యార్థులు 84వ గ్రిగ్ మెమోరియల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జూనియర్ విభాగంలో విన్నర్స్‌గా నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం జి.బి.కె సుధారాణి, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ అజ్గర్ షరీఫ్ విద్యార్థులను అభినందించారు.

డెంగ్యూ, సీజనల్ ఫీవర్ నిరోధక మాత్రల పంపిణీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉర్దూ స్కూల్‌లో శుక్రవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించి 222 మంది విద్యార్థులకు డెంగ్యూ, సీజనల్ జ్వరాలు, రోగ నిరోధకశక్తి పెంచడానికి హోమియో మాత్రలు పంపిణీచేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబ శివరావు, కార్యదర్శి చంటిబాబు, ట్రెజరర్ శ్రీనివాసరావు, డాక్టర్ తిరు మలరావు, రాంబాబు, సత్యకిషోర్, రోటరీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, అ నీస్ తదితరులు పాల్గొని సేవలందించారు.

కంకర.. బతుకు చిందరవందర



పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డుపై చిందరవందరగా పడిన కంకర

- టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యం
- పట్టాలు కప్పకుండా తోలకాలు
- పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై టిప్పర్ల నుంచి జారిపడిన కంకర
- స్కూటీపై నుంచి పడి వాహనదారుడికి గాయాలు

టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యం ద్విచక్రవాహనదారుల పాలిట శాపంగా మారింది. పైన పట్టాలు కప్పకుండా కొన్ని టిప్పర్లు గురువారం అర్ధరాత్రి పరిమితికి మించి కంకర రవాణా చేశాయి. పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై టిప్పర్ల నుంచి జారిన కంకర చిందరవందరగా పడింది. శుక్రవారం ఉదయం నాలుగు గంటల సమయంలో అటుగా స్కూటీపై వెళుతున్న ఓ యువకుడు పక్కన వాహనాలు వేగంగా రావడంతో కంకరపైకి వెళ్లాల్సి వచ్చింది. దీంతో అతను స్కూటీతో సహా జారిపడ్డాడు. తలకు గాయమైంది. అటుగా వెళుతున్న వాహనదారులు అతనికి సపర్యలు చేశారు. **- విజయవాడ**



కంకరలోడుపై పట్టా కప్పకుండా వెళుతున్న టిప్పర్



స్కూటీపై వెళుతుండగా కంకరపై జారిపడడంతో గాయపడిన వాహనదారుడు



హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వాహనదారుడికి చాక్లెట్ ఇస్తున్న డీటీసీ ఎ.మోహన్

హెల్మెట్ పెట్టు..చాక్లెట్ పట్టు!

- హెల్మెట్ ధారణపై వినూత్నంగా అవగాహన

కృష్ణలంక, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం భారం కాదని, అది బాధ్యతని, ప్రాణాలు కాపాడే అస్త్రమని ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్ పేర్కొన్నారు. బందరురోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం సమీపంలోని పెట్రోల్ బంక్ దగ్గర వాహనదారుల భద్రత కోసం రవాణాఅధికారులు 'హెల్మెట్ పెట్టుకో చాక్లెట్ పట్టుకో' అనే నినాదంతో అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడిపిన ప్రతి ఒక్కరికీ అధికారులు చాక్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీటీసీ ఎ.మోహన్ హాజరయ్యారు. ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, వాహన తనిఖీ అధికారులు వి.పద్మాకర్, ఎ.ఉదయ్‌శివప్రసాద్, డీవీ రమణ, బి.శ్రావణి, గీతాంజలి, ప్రియదర్శిని, కేవీ రవిగోపాల్, బి.ఉమామహేశ్వరరావు, రవాణా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజుబాబు పాల్గొన్నారు.



మైలవరం సీఐ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, ధర్నాలో కూర్చున్న సంసోను

సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను సస్పెండ్ చేయాలి

- మైలవరం సీఐ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా
- ఏసీపీ ప్రసాదరావుకు వినతిపత్రం ఇచ్చి విరమణ

మైలవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ములకలపెంట మర్డర్ ఘటనలో అనుమానితునిగా అదుపులోకి తీసుకున్న వడ్లపూడి సంసోనుపై థర్డ్ డిగ్రీ పయోగించిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం సీఐ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. ములకలపెంటలో తన తండ్రి కడియం శ్రీనివాసరావును కొడుకు కడియం పుల్లారావు మర్డర్ చేసి ఆ నేరం సంసోనుపై అతని యజమాని చల్లా సుబ్బారావుపై మోపితే అనుమానితులుగా ఇద్దరినీ అరెస్టు చేశారని, సుబ్బారావుకు రాచమర్యాదలు చేసి, దళితుడైన సంసోను చితకబాదారని, నేరం చేసినట్లు ఒప్పుకోమని థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, చెట్టుకు వేలాడదీసి కొట్టారని ఎమ్మార్పీఎస్ నేతలు ఆరోపించారు. బాధితుడు తమ ఎదుట బోరుమన్నాడని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాణం పోతుందనే భయంతో నేరం చేసినట్లు ఒప్పుకొన్నానని, దైవం తన పక్షాన ఉండి నేరం చేసిన వ్యక్తి పట్టుబడ్డాడని సంసోను వాపోయాడు. దండం పెట్టినా పోలీసులు తనపై దయ చూపలేదని తెలిపాడు. దళితుడిని బలిపశువును చేయాలని చూడమే కాకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించి కేసు పక్కదారి పట్టించాలని చూసిన పోలీసులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. తమ అధినేత మంద కృష్ణమాదిగ ఆదేశాలతో ఈనెల 15న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. పొద్దుపోయాక ఏసీపీ ప్రసాదరావుకు వినతిపత్రం ఇచ్చి ధర్నాను విరమించారు. మందా వెంకటేశ్వరరావు మాదిగ, కోట దానియేలు మాదిగ, ఆదూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- సీఎంకు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నేతల విజ్ఞప్తి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రమిస్తున్న సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధులు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణలో సముచిత న్యాయం చేయాలని, వెల్ఫేర్ అసిస్టెంట్, డెవలప్‌మెంట్ కార్యదర్శులకు ప్రమోషన్ ఇవ్వాలని, మిగులు సిబ్బందిని సాంఘిక సంక్షేమశాఖలో సర్దుబాటు చేయాలని సీఎం చంద్రబాబునాయుడును కోరామని సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుడి నాగరాజు, సీహెచ్ అన్నపూర్ణాచారి తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎమినిటీస్ సెక్రటరీ, గ్రామ సర్వేయర్, వీఆర్వో, ప్లానింగ్ సెక్రటరీలను లైజన్ డిపార్ట్‌మెంట్లలో కలపాలని కోరామని, ఏఎన్ఎంలపై రెండు శాఖల పెత్తనం లేకుండా చూడాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరినట్టు వారు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పైసలిస్తేనే పాస్‌పోర్టు వెరిఫికేషన్

ఓ పోలీసు అధికారి అక్రమార్జన

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో చుక్కలు
- అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక కొర్రీ పెట్టి వసూళ్లు

(ఆంధ్రజ్యోతి-గన్నవరం):
అష్టకష్టాలు పడి పాస్‌పోర్టు కార్యాలయంలో ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని వస్తున్న అభ్యర్థుల జేబులకు చిల్లులు పడుతున్నాయని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో ఓ పోలీసు అధికారి వేలకువేలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేమని ప్రశ్నిస్తే ఫైల్ అప్రూవల్ చేయించాలా.. వద్దా? అంటూ భయపెడుతున్నారని, దిక్కుతోచక అడిగిన సొమ్ము చెల్లించి వెరిఫికేషన్ పూర్తి చేయించుకుంటున్నారని తెలుస్తోంది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మూడు మండలాల్లో ఎవరు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నా ఎస్‌బీ అధికారులు వెరిఫికేషన్ చేయాలి. అయితే ఈ వెరిఫికేషన్ కిందిస్థాయి అధికారులు కూడా చేయొచ్చు. కానీ, గన్నవరంలో మాత్రం ఓ అధికారి రంగంలో దిగి పాస్‌పోర్టు వెరిఫికేషన్లు చేస్తున్నారు. వెరిఫికేషన్‌కు వచ్చిన అభ్యర్థులు పైసలు చెల్లిస్తేనే ఫైల్ పైకి వెళుతుంది. లేకుంటే వారికి చుక్కలే. ఫార్మాలిటీస్ పేరుతో యథేచ్ఛగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఫైల్ పంపాలంటే బోలెడంత ఖర్చు అవుతోంది..మీకేం తెలుసు అంటూ గట్టి స్వరంతో మాట్లాడడంతో భయపడి నగదు చెల్లిస్తున్నారు. నెలకు సుమారుగా వంద వెరిఫికేషన్ల వరకూ వస్తాయని సమాచారం. దీనిబట్టి చూస్తే ఆ అధికారి వసూళ్ల పర్వం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కనీసం రూ.500 నుంచి ఆ పైన అభ్యర్థి ఇచ్చుకునేంత వరకూ డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వలేమని చెప్పినా ఇవ్వాల్సిందేనని గట్టిగా డిమాండ్ చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్ ఇళ్ల వద్దకు వెళ్లి చేయాలి. కానీ ఈ అధికారి మాత్రం తాను ఎంచుకున్న ప్రాంతానికి పిలిపించి చేస్తున్నారు. పోలీసులు అధికారి అక్రమ వసూళ్లను నివారించాలని అభ్యర్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోలీసు అధికారి నిర్వాకాలు

- ఆయనొక ఉపాధ్యాయుడు. కుమార్తె పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. అది గన్నవరంలోని పోలీసు అధికారి దగ్గరకు చేరింది. వెంటనే ఆ అధికారి దరఖాస్తులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేశారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వచ్చిందని ఒరిజనల్ చూపించి సంతకాలు చేసి వెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయుడు కుమార్తెతో కలిసి వచ్చి ఒరిజనల్స్ చూపించి సంతకాలు చేశారు. వెనుదిరిగి వెళుతుండగా ఫార్మాలిటీస్ రూ.వెయ్యి ఇవ్వాలని పోలీసు అధికారి అడిగారు. అదేంటి సార్ మీ పని మీరు చేశారు. దానికి ఫార్మాలిటీ ఏమిటని ఉపాధ్యాయుడు ప్రశ్నించారు. కుదరదు ఇవ్వాల్సిందే ఈ ఫైల్ మొత్తం పంపించాలంటే ఖర్చవుతుంది అనడంతో తప్పక రూ.వెయ్యి ఇవ్వాల్సి వచ్చింది.
- ఆ విద్యార్థినిది మారుమూల గ్రామం. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంది. ఆ దరఖాస్తు పోలీసు అధికారి దగ్గరకు రాగానే ఫోన్ చేశారు. వచ్చి సర్టిఫికెట్లు చూపించి సంతకాలు చేసింది. ఆ అధికారి రూ.1500 అడిగారు. దీంతో వాళ్లు అవాక్కయ్యారు. వెరిఫికేషన్ ఉచితంగా ఉంటుంది అనుకుని వస్తే ఇదేంటని నోరెళ్లబెట్టారు. అడిగిన నగదు ఇస్తేనే ఫైల్ పైకి పంపిస్తా లేకుంటే మీ ఇష్టం అని అధికారి చెప్పారు. దీంతో తెలిసిన వారి దగ్గర అప్పు చేసి ఆ అధికారి చేతిలో నగదు పెట్టి వెళ్లిపోయారు.

ఇంధనాన్ని పొదుపు చేద్దాం

- ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలు పరిరక్షిద్దాం
- శక్షం ప్రారంభ కార్యక్రమంలో వక్తల పిలుపు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పౌరసరఫరాల రాష్ట్ర కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ సౌరభ్‌గౌర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు ద్వారా ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షిద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం శక్షం(సంరక్షణ క్షమత మహోత్సవం) పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌరసరఫరాల రాష్ట్ర కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ సౌరభ్‌గౌర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇంధన పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పెరుగుతున్న వాహనాల వినియోగానికి అనుగుణంగా పెట్రోలియం ఉత్పత్తులను సంరక్షించాలని, క్లీన్ అండ్ గ్రీన్ ఇంధనాలు, ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించాలని అని సౌరభ్ గౌర్ పిలుపునిచ్చారు. కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు 15 రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చమురు పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త వి.వేణుమాధవ్ తెలిపారు. సైకిల్ ర్యాలీ, వాక్‌థాన్, సీఎన్‌జీ ఆటోలు, కార్ల ర్యాలీలు, ఎల్పీజీ డెలివరీ బాయ్‌లకు శిక్షణ, గృహిణులకు, పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఇంధన ఆదాపై చిట్కాలు తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. డ్రాయింగ్ పోటీల విజేతలకు, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ విజయవాడ డివిజనల్ రిటైల్ సేల్స్ హెడ్ ఎ.వి.అనిల్‌కుమార్, బీపీసీఎల్ విజయవాడ ప్రాంతీయ మేనేజర్ ప్రసాద్ రాజ్వాడే, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అవినాష్ కుమార్, బీపీసీఎల్ ఎల్పీజీ రీజనల్ మేనేజర్ సీటీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మ తిరునాళ్ల స్టాళ్లలో కోళ్ల మృతి

- బర్డ్ ఫ్లూ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- అప్రమత్తమైన అధికారులు



కోళ్లకు పరీక్షలు చేస్తున్న పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి చిననరసింహులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ తిరునాళ్లలో ఏర్పాటు చేసిన కోళ్ల విక్రయించే స్టాళ్లలో కొన్ని కోళ్లు మృతి చెందాయి. వాటికి బర్డ్‌ఫ్లూ లక్షణాలు అని సోషల్‌మీడియాలో గురువారం రాత్రి వైరల్ అయ్యింది. దీంతో శుక్రవారం ఉదయం పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి ఎన్.చిననరసింహులు, స్థానిక పశువైద్యశాల ఏడీ రామశేఖర్, ఉయ్యూరు కమిషనర్ పి.వెంకటేశ్వరరావు స్టాళ్ల వద్ద పరిశీలించారు. జీవించి ఉన్న కోళ్ల నుంచి రక్తము, ఇతర అవయవాల శాంపిళ్లు తీశారు. పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉంటే గుట్టలుగా కోళ్లు మృత్యువాత పడతాయని, జాలీల్లో ఉంచడంతో కోళ్లు తొక్కిసలాటకు మృతిచెంది ఉంటాయని భావిస్తున్నామన్నారు. విక్రయ స్టాళ్లు, కోళ్లు ఉంచే ప్రదేశాల్లో మున్సిపల్ కమిషనర్ శుభ్రం చేయించి బ్లీచింగ్, సున్నం చల్లించారు. కోళ్లు ఉంచే చోట పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని విక్రయదారులను ఆయన ఆదేశించారు.



అవార్డులు అందుకున్న సిబ్బందితో రైల్వే అధికారులు

అన్ని విభాగాల్లో అద్భుత ప్రగతి

- విజయవాడ రైల్వే డివిజన్ సిబ్బందికి డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రశంస

రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ అన్ని విభాగాల్లో అద్భుత ప్రగతి సాధించిందని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. రైల్వే వారోత్సవాల సందర్భంగా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో 69వ రైల్వే వారోత్సవ వేడుకను శుక్రవారం నిర్వహించారు. డివిజన్ ప్రగతికి విజయవాడ రైల్వే డివిజన్‌లో పనిచేసే సిబ్బందే కారణమని ఆయన ప్రశంసించారు. డివిజన్ సమర్థవంతంగా పనిచేయడానికి జట్టు కృషి ఉందని రైల్వేలో పనితీరు మెరుగుకు ఇది ఉదాహరణ అని తెలిపారు. ఉద్యోగుల ఐక్య కృషి ప్రయాణికులకు సంతృప్తికరమైన సేవలను అందిస్తుందన్నారు. 2024-2025లో డివిజన్ రూ.5వేల కోట్ల స్థూల ఆదాయాన్ని అధిగమించిందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో అమృత భారత్ పథకం కింద విజయవాడ డివిజన్‌లోని 20 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్‌జీ-1లో రూ.500 కోట్ల ఆదాయం వచ్చిందని, దక్షిణ మధ్య రైల్వేలో రెండవ స్టేషన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. 2024లో స్ఫూర్తిదాయక, ఆదర్శ సేవలను అందించిన 54 మందికి అవార్డులు ఇచ్చి సత్కరించారు. మౌలిక సదుపాయాల ఏడీఆర్‌ఎం పీఈ అడ్విన్, ఆపరేషన్స్ ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుంటూరు నుంచి పార్వతీపురానికి ఆర్టీసీ బస్సు

బస్ స్టేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి పార్వతీపురానికి రోజూ ఆర్టీసీ ఇంద్ర ఏసీ బస్సు నడుపుతున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.యేసుదానం శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. 3181 సర్వీసు నెంబరు బస్సు గుంటూరులో రాత్రి 7.15 గంటలకు బయలుదేరి 8.20 గంటలకు విజయవాడ, రాత్రి 10 గంటలకు ఏలూరు, 11.45కు రాజమండ్రి, అర్ధరాత్రి 1.30 గంటలకు అన్నవరం, మరునాడు తెల్లవారుజామున 4.15 గంటలకు విశాఖపట్నం, 5.30 గంటలకు విజయనగరం, 6 గంటలకు గజపతినగరం, 6.40 గంటలకు బొబ్బిలి, 7.15 గంటలకు పార్వతీపురం చేరుకుంటుందని ఆయన తెలిపారు. తిరిగి ఇదే రూటులో 3182 సర్వీసు నెంబరు బస్సు పార్వతీపురంలో సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. విజయవాడ నుంచి పార్వతీపురానికి రూ.1,140 చార్జీ ఉంటుందన్నారు. సీఆర్డీయే ప్రాంతంలోని తాడేపల్లి క్రాస్ రోడ్, కుంచనపల్లి క్రాస్‌రోడ్, మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి, నిర్మలా కాన్వెంట్ బస్టాప్‌ల వద్ద ఎక్కేందుకు, దిగేందుకు సౌకర్యం ఉందని, అడ్వాన్స్ రిజర్వేషన్ ఆర్టీసీ వెబ్‌సైట్, బస్‌స్టేషన్లు, అధీకృత ఏజెంట్లవద్ద చేయించుకోవచ్చని సూచించారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

- మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు

గుణదల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధితులకు అండగా నిలిచేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో యూఫోరియా మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నందున శనివారం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు హాజరవుతారని, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తామని సీపీ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ముందుగా తెలియజేసిన ప్రదేశాల్లోనే వారి వాహనాలను పార్క్ చేయాల్సి ఉంటుందని, ఎక్కడపడితే అక్కడ పార్క్ చేయొద్దని సూచించారు.

వాహనాల మళ్లింపు ఇలా..

- ఆర్టీసీ వై జంక్షన్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా స్వర్ణపాలెస్, దీప్తి సెంటర్‌చుట్టుగుంట, పడవలరేవు, గుణదల, రామవరప్పాడు రింగ్ మీదుగా బెంజిసర్కిల్ వైపు మళ్లిస్తారు
- ఆర్టీసీ వై జంక్షన్ నుంచి బందర్ లాకులు, రాఘవయ్య పార్క్, పాత ఫైర్‌స్టేషన్ రోడ్, అమెరికన్ హాస్పిటల్, మసీదు రోడ్డు, నేతాజీ బ్రిడ్జి, గీతానగర్, స్క్రూబ్రిడ్జి మీదుగా బెంజిసర్కిల్ వైపు మళ్లిస్తారు.
- బెంజిసర్కిల్ వైపు నుంచి బందర్ రోడ్డులోకి వచ్చే వాహనాలు బెంజిసర్కిల్ నుంచి ఫకీరుగూడెం-స్క్రూబ్రిడ్జి-నేతాజీబ్రిడ్జి- బస్టాండ్ వైపునకు మళ్లిస్తారు.
- రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్-శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరీ జంక్షన్ వరకు వాహనాలకు అనుమతి లేదు.
- బెంజి సర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తారు.

చిట్టూరి భార్గవ్‌కు కన్నీటి వీడ్కోలు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఐర్లాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జగ్గయ్యపేటకు చెందిన చిట్టూరి భార్గవ్ భౌతికకాయానికి శుక్రవారం హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు నివాళులర్పించి, కన్నీటితో వీడ్కోలు పలికారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు భార్గవ్ తల్లిదండ్రులు చిట్టూరి సాయిబాబు, రాధికను పరామర్శించారు. భౌతికకాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం ప్రత్యేక వాహనంపై అంతిమయాత్ర నిర్వహించారు. యాత్రలో భార్గవ్ స్నేహితులు, బంధువులు భారీగా పాల్గొన్నారు.



భార్గవ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

ఏపీయూడబ్ల్యూజే 2025 డైరీ ఆవిష్కరణ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) విజయవాడ యూనిట్ రూపొందించిన 2025 మీడియా డైరీని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ, యూనియన్ నేతలతో కలిసి గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని శివాజీ అన్నారు. బుడమేరు వరదల సమయంలో జర్నలిస్టుల కృషిని ఆయన కొనియాడారు. డైరీ ముద్రణకు సహకారాలు అందించిన రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావుకు యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ అర్బన్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజు, దాసరి నాగరాజు, యూనియన్ అర్బన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో 10కె రన్ రేపు

గుడివాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పర్వతనేని జగన్మోహనరావు 20వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16న 10కె రన్ నిర్వహిస్తున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. స్టేడియం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 16న ఉదయం జగన్మోహనరావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో పురుషులకు 10కె రన్, మహిళలకు 6కె రన్, 4కె రన్ వేర్వేరుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. పాల్గొనేవారు స్టేడియం కార్యాలయంలో 15వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని యలవర్తి కోరారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కమిటీ సభ్యులు డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ, వల్లభనేని లక్ష్మీవరప్రసాద్, అడుసుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మండల ప్రత్యేకాధికారి జి.రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ వార్షికోత్సవం నేడు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు ఏ.ఎ.ఎస్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ 44వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఏపీ సాంకేతిక విద్యాశాఖ సెక్రటరీ జి.వి.రామచంద్రరావు, విశిష్ట అతిథిగా పాలి టెక్నిక్ పూర్వవిద్యార్థి, వరంగల్ నిట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీహరిరావు హాజరవుతారని రాజశేఖర్ తెలిపారు. పాలిటెక్నిక్ టాపర్స్‌కు బంగా రు పతకాలు, క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజే స్తామని, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నాగన్నచెరువు గ్రామానికి చెందిన మహిళ దొండపాడు పంట కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నం చేస్తుండగా, గస్తీ తిరుగుతున్న రూరల్ పోలీసులు గమనించి ఆమెను కాపాడారు. ఐసీడీఎస్, మాతాశిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు సదరు మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె తల్లిండ్రులను అప్పగించారు. రూరల్ ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు మహిళను కాపాడినందుకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



విజేతలతో పీడీ బసవయ్య

కాజ జడ్పీ విద్యార్థినుల ప్రతిభ

కూచిపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో బాలికల విభాగంలో కాజ జడ్పీ పాఠశాల విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. విజేతలైన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన పీడీ బసవయ్యను ప్రధానోపాధ్యాయురాలు రమణి, పాఠశాల విద్యాకుటుంబం అభినందించింది.



పామర్రులో చికెన్ దుకాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్యోతి

అప్రమత్తంగా ఉండాలి

పామర్రు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి నేపథ్యంలో చికెన్ వినియోదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. పట్టణంలోని చికెన్ అమ్మకపు దుకాణాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. చికెన్ దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. ఇతర జిల్లాల నుంచి కోళ్లను కొనుగోలు చేయరాదన్నారు. మండలంలోని కోళ్ల ఫారాల వద్ద యాజమనులు రక్షణ చర్యలు తీసుకునేలా అవగాహన కల్పించాలని కార్యదర్శులను ఆదేశించారు. శానిటరి అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన!

- వెంట్రప్రగడ వద్ద దోసపాడు చానల్‌పై శిథిలావస్థకు చేరిన వంతెన
- పెచ్చులూడిన అడుగుభాగం
- విరిగిపోయిన రెయిలింగ్
- భారీ వాహనాలకు అనుమతిలేకపోయినా రాకపోకలు
- భయాందోళనలో గ్రామస్థులు



శిథిలావస్థకు చేరిన వంతెనపై వాహనాలు

(ఆంధ్రజ్యోతి-పెదపారుపూడి)

గుడివాడ నుంచి కంకిపాడు వెళ్లే రోడ్డు వెంట్రప్రగడ గ్రామం వద్ద దోసపాడు చానల్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. వందేళ్ల కిందట నిర్మించిన వంతెన శిథిలమై ప్రమాదకరంగా మారింది. వంతెన పూర్తిగా పాడైపోవటంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వంతెన అడుగు భాగం శ్లాబు పెచ్చులూడిపోతున్నాయి. గోడకు పగుళ్లు ఇచ్చాయి. రెయిలింగ్ విరిగిపోయింది. వంతెన వద్ద రహదారి మలుపు నీటి ఒరవడికి ప్రమాదకరంగా తయారయింది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవటానికి ఇబ్బందికరంగా మారింది. భారీ వాహనాలకు అనుమతులు లేకపోయినా రాకపోకలు సాగించటంతో ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గుడివాడ, భీమవరం, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి గ్రామాల నుంచి విజయవాడ వెళ్లటానికి ఈ మార్గం దగ్గరగా ఉండటంతో వేలాది వాహనాలు ఈ వంతెన మీదుగా వెళ్తుంటాయి. ఇది కూలిపోతే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కొత్త వంతెన నిర్మించాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించండి

గుడివాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్నివేళలా, అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా శుక్రవారం ఏకేటీపీ, గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ, ఉపాధ్యాయులకు సముచిత స్థానం, గౌరవం కల్పించిందన్నారు. ఆలపాటికి మద్దతు గా నిలిచి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కొకరరావు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి.వి.ఎన్‌డి ప్రసాద్, ఎ.ఎస్.వి ప్రసాద్, మడకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మెగా గృహ రుణమేళా నేడు, రేపు

గుడివాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15, 16 తేదీల్లో ఎస్‌బీఐ ప్రధా న బ్రాంచ్‌లో మెగా గృహ రుణమేళా నిర్వహిస్తున్నట్లు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ బి.ముకుందరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు అన్ని విధాలుగా సేవలను అందించేందుకు ఎస్‌బీఐ ఎల్లపుడు అందుబాటులో ఉంటుందన్నారు. ఖాతాదారుల కోసం ప్రత్యేకంగా శని, ఆదివారాల్లో ఇంటి, గృహం కొనుగోలుపై ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నా మన్నారు. ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశామని, పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ముకుందరాజు కోరారు.

రోడ్డు అభివృద్ధి కోరుతూ పోస్టుకార్డులు

గుడివాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : గుడివాడ-కంకిపాడు రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ హైకోర్టులో వేసిన ప్రజావ్యాజ్యం కేసును వెంటనే విచారణ చేపట్టాలని కోరుతూ రెండో విడత పోస్టుకార్డులను హైకోర్టు న్యాయమూర్తికి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపినట్లు భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకులు వై.వి.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు రిజిస్టర్ పోస్టు ద్వారా పోస్టు కార్డులను పంపించారు. ఇప్పటికే మొదటి విడత పోస్టుకార్డులను పంపామని, తిరిగి శుక్రవారం రెండో విడత కార్డులను పంపినట్లు మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.పూర్ణచంద్రరావు, యమ్.తాహెర్ భాషాలు పాల్గొన్నారు.



రెండో విడత పోస్టుకార్డులను అందజేస్తున్న భద్రతా దళం సభ్యులు

మమత వృద్ధాశ్రమంలో అన్నదానం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వలివర్తిపాడులోని గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్ అధినేత రెవ. సజ్జా బర్నబాస్ - జీవన రాణి దంపతుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని పేదలు, వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం నిర్వహించారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 14 నుంచి మార్చి 1వ తేదీ వరకు గుడివాడ పరిసర ప్రాంతాల్లోని పేదలు, అనాథలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మమత వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. పంట కాల్వ గట్లపై పేడలు అన్నదానం చేసి దుప్పట్లను పంపిణీ చేశారు. బర్నబాస్ దంపతుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన ఐడీ కార్డు ఉండాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. రైతులందరూ 11 అంశాలతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, పాన్‌కార్డు, భూ సర్వే వివరాలన్నీ నమోదు చేయించుకుంటే ప్రభుత్వ సబ్సిడీలు, రాయితీలు అందుతాయని తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయశాఖ ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రైతు ఐడీ నెంబర్ కలిగి ఉండాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు వీటిని నమోదు చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గుర్తింపు సంఖ్య ప్రయోజనాన్ని రైతులకు వివరిస్తున్న పద్మావతి

కపిలేశ్వరపురంలో..

పమిడిముక్కల : సొంత భూమి కలిగిన ప్రతిరైతు తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి అన్నారు. కపిలేశ్వరపురంలో రైతుసహాయ కేంద్రంలో శుక్రవారం రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు వల్ల ప్రయోజనాలు రైతులకు వివరించారు. గన్నవరం ఏడీఏ సునీల్, మండల వ్యవసాయ అధికారి గణేశ్ పాల్గొన్నారు.



మొవ్వ జడ్పీ పాఠశాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రజా సంఘాల నేతలు

కె.ఎస్‌ను గెలిపించాలని ప్రజా సంఘాల ప్రచారం

కూచిపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు ఓట్లు అభ్యర్థించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించి మొదటి ప్రాధాన్యత ఓటు లక్ష్మణరావుకు వేసి విజయాన్ని చేకూర్చాలని కోరారు. ప్రజా సంఘాల నేతలు శీలం నారాయణరావు, పాగోలు రమేష్‌బాబు, కొడాలి శ్రీనివాసరావు, కొడాలి కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి

పామర్రు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్ నిధులతో పామర్రులో నూతనంగా నిర్మించిన సామాజిక మరుగుదొడ్లను తక్షణమే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవో కె.జ్యోతి ఆదేశించారు. స్వచ్ఛ భారత్ నిధులు రూ.3.50 లక్షల నిధులతో నిర్మించి, ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. 90 శాతం నిర్మాణం పూర్తయినా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం విషయమై అధికారులను ప్రశ్నించారు. మిగిలిన పదిశాతం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్యదర్శి అబ్దుల్ సలీం, శానిటరి అధికారి సుధాకర్‌ను ఆమె ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి.రత్నకర్‌రావు పాల్గొన్నారు.

విద్యావికాస్ డైరెక్టర్ ఎం.ఎస్.ఆర్ మృతి



సుబ్బారావు (ఫైల్)

గుడివాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యావికాస్ విద్యా సంస్థల వ్యవస్థాపక డైరెక్టర్ ముప్పాళ్ల సుబ్బారావు(71) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. గుడివాడ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు ఎంఎస్ఆర్‌గా, పెద్దసార్‌గా ముప్పాళ్ల సుపరిచితులు. 20 ఏళ్ల పాటు గుడ్లవల్లేరులోని డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకులుగా సేవలందించారు. 1992లో కొమ్మినేని సాంబశివరావుతో కలిసి విద్యావికాస్ పాఠశాలను స్థాపించి అనతికాలంలోనే తల్లిదండ్రుల మన్ననలను పొందారు. ఎంఎస్ఆర్ కుమార్తె రేష్మా చౌదరి హైదరాబాద్‌లో ప్రైవేట్ పాఠశాలను నడుపుతున్నారు. ఎం.ఎస్.ఆర్ అకస్మిక మృతితో పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు కన్నీటి పర్యాంతమయ్యారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ కొమ్మినేని నిషాంత్, పలు విద్యాసంస్థల చైర్మన్లు, అప్సా సభ్యులు, పట్టణ ప్రముఖులు ఎం.ఎస్.ఆర్ మృతికి సంతాపం తెలిపారు.

వంశీ అరెస్టుతో న్యాయం గెలిచింది

● కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ

గుడివాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌ని కూటమి ప్రభుత్వం కక్షతో అక్రమంగా అరెస్టు చేసిందని సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పేర్కొన్నారు. ధనియాలపేటలోని ఆయన వ్యక్తిగత కార్యాలయలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వంశీ అరెస్టుతో న్యాయం గెలిచిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అక్రమంగా కేసులను బనాయించిందన్నారు. గన్నవరంలో వంశీ, గుడివాడలో కొడాలి నానిలు తమ గ్యాంగ్‌లతో బీభత్సం వాతావరణాన్ని సృష్టించి, భయానక పరిస్థితులను కల్పించారన్నారు. ఒక మిత్రుడు జైలు పాలయ్యాడని, మరో మిత్రుడు కూడా జైలుకు పోవడానికి సిద్ధంగా ఉన్నాడని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీ నాయకులకు లేదని మజ్జాడ అన్నారు.



పుల్వామా దాడిలో అమరులైన జవాన్‌లకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అమర వీరులను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి

గుడివాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : పుల్వామా దాడిలో అమరులైన జవాన్‌లను స్మరిస్తూ, ప్రతి ఒక్కరూ నివాళులర్పించాలని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. చౌదరిపేటలోని శిరీష ఫౌండేషన్‌లో ఆర్‌కె ఆధ్వర్యంలో అమర జవాన్లకు నివాళులర్పించారు. దేశ ప్రజలు సంతోషంగా, ధైర్యంగా ఉన్నారంటే సరిహద్దుల్లో జవాన్‌ల సేవలే కారణమన్నారు. నాయకులు బోనం గోపిక, పండు, రీటా, రాంబాబు, చరణ్, శిరీష ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

గుడివాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ బాధితులు ఏఆర్‌టీ మందులను వాడు కుంటూ పౌష్టికాహారం తీసుకుంటే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చునని ఎల్.మధుసూదనరావు అన్నారు. కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థల ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సిలర్ విజయ, డీఆర్‌పీ బి.మౌనిక, పౌష్టికాహార దాత సిహెచ్ సువర్ణరాజు, జోనల్ సూపర్‌వైజర్ బి.రాకేష్, పి.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార లోపం నివారణపై శిక్షణ

గుడివాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : పోషణ బీ - పడాయి బీ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సీడీపీవో విజయఫ్లోరెన్స్ అంగన్వాడీ వర్కర్‌లకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాఠశాలలోని విద్యార్థుల పెంపుదలకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. సూపర్‌వైజర్ కె.నాగజ్యోతి, ఎ.జయంతి తదితరులు పాల్గొన్నారు.



పోషణబీ-పడాయిబీ కార్యక్రమం గురించి వివరిస్తున్న సీడీపీవో విజయఫ్లొరెన్స్

వానపాముల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..

పెదపారుపూడి: మండలంలోని వానపాముల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం సూపర్‌వైజర్లు ఎం.శివనాగమణి, జి.అరుణ కుమారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. పోషకాహార లోపం పిల్లలను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చిన్న పిల్లల్లో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. 0-6 సంవత్సరాల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలోనూ, ఇంటి వద్ద సమాజంలో సురక్షితంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వానపాముల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..

తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

పమిడిముక్కల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పోషణ్ బీ -పడాయి బీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి, సూపర్‌వైజర్లు ఉషా, అనిత, ఝాన్సీ పాల్గొని పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధికి, పౌష్టికాహార లోపానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.450

వృద్ధుల కంటి ఆపరేషన్లకు కొల్లు నీలిమ చొరవ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో ఆపరేషన్లకు ఎంపిక చేసిన వృద్ధులను కొల్లు ఫౌండేషన్ చైర్మన్ కొల్లు నీలిమ శుక్రవారం పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి పంపారు. లలిత కన్వెన్షన్ హాలులో 300 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 31 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. దీంతో వారిని కొల్లు నీలిమ పెదకాకానికి పంపారు. ఈ 31 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేసి కళ్ల జోళ్లు ఇచ్చి తిరిగి మచిలీపట్నం పంపుతారని కొల్లు నీలిమ తెలిపారు.



అంతిమయాత్రలో పాల్గొని పాడె మోస్తున్న మంత్రి రవీంద్ర కొనకళ్ల బుల్లయ్య, బండి రామకృష్ణ తదితరులు (ఇన్‌సెట్లో వరలక్ష్మి) (ఫైల్)

కోస్తా మురళీకృష్ణకు సతీవియోగం

● వరలక్ష్మి భౌతికకాయానికి మంత్రి రవీంద్ర, రామకృష్ణ నివాళి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం కారణంగా 10వ డివిజన్ టీడీపీ నాయకుడు కోస్తా మురళీకృష్ణ భార్య పేర్ల వరలక్ష్మి(54) శుక్రవారం మృతి చెందారు. వరలక్ష్మి భౌతికకాయానికి మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు వారు పాల్గొన్నారు. కోస్తా మురళీకృష్ణను టీడీపీ నాయకులు ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, బత్తిన దాసు, పలువురు టీడీపీ కార్పొరేటర్లు పరామర్శించారు.



సీఎం ఆర్థిక సాయం మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

21 మందికి సీఎం ఆర్థిక సాయం

అవనిగడ్డ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పేదల వైద్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 21 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్యఖర్చుల కోసం రూ.18.86 లక్షలు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచే 116 మంది పేదలకు వైద్య ఖర్చుల కోసం 92.88 లక్షలు అందజేసినట్లు తెలిపారు. పేదల వైద్యానికి ప్రాధాన్యతనిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.



జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ నేతృత్వంలో సాగునీటి కాల్వల బాగుచేత పనులు చేపట్టిన కానూరు రైతులు

కానూరు రైతుల చొరవ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కానూరు పంచాయతీ పరిధిలో కానూరు నుంచి నందమూరు వరకు ఏడు కిలోమీటర్ల మేర పంట కాల్వల్లో పూడికతీత పనులను తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రానున్న ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకుని ముందుగానే రైతులను గోపు సత్యనారాయణ చైతన్యవంతుల్ని చేశారు. బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, సిద్ధిరెడ్డి పాండురంగారావు, గమిడి రంగారావు, అల్లం పెద్దిరాజులు, జొన్నల రామాంజనేయులు, బోట్ల రాజేష్ పాల్గొన్నారు.

గోగినేనిపాలెం జడ్పీ విద్యార్థినుల ప్రతిభ



ఘంటసాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలలో గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ బాలికలు ప్రథమ స్థానం పొంది విజయం సాధించారని హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్ఎం మాట్లాడుతూ సెంట్రల్ జోన్ ఆటల పోటీలలో బాలురు మాదిరిగానే, బాలికలు కూడా ప్రథమ స్థానంలో నిలవటం హర్షించదగ్గ విషయమని తెలిపారు. పీడీ గరికపాటి మారుతిని, విద్యార్థినులను ఆమె అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్యావల దేవదత్



ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ పెనుమల్లి ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

● ఎన్నికల పరిశీలకుడు శ్యావల దేవదత్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తిరువూరు టీడీపీ నాయకుడు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు శ్యావల దేవదత్ పిలుపునిచ్చారు. కన్యకా పరమేశ్వరీ సత్రంలో శుక్రవారం క్లస్టర్ ఇన్‌చార్జి అక్కుమహంతి రాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో దేవదత్ మాట్లాడారు. ఆలపాటి విజయంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, టీడీపీ నాయకుడు కట్టా అంజిబాబు, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులు మాట్లాడారు. అంతకుమునుపు ఈడేపల్లి రామాలయంలో ఏడో క్లస్టర్ ఇన్‌చార్జి పల్లపాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో శ్యావల దేవదత్ మాట్లాడారు. పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యతా ఓటు ఆలపాటికి వేయాలన్నారు. టీడీపీ కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, మాజీ కౌన్సిలర్ గనిపిశెట్టి గోపాల్, టీడీపీ నాయకులు హసీంబేగ్, పి.వి. ఫణికుమార్, మంచాల రాంబాబు, విన్నకోట శ్రీనివాసరావు, పడమట నాగరాజు తదితరులు మాట్లాడారు. **పెడన రూరల్ :** ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయంకోసం కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, మండల టీడీపీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, కూటమి నాయకులతో పట్టభద్రులను కలిసి తొలి ప్రాధాన్యతా ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. **అవనిగడ్డ :** ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నేత మండలి వెంకట్రామ్ కోరారు. అవనిగడ్డలో శుక్రవారం వివిధ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, గ్రాడ్యుయేట్లను ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే కనకదుర్గ, కూనపరెడ్డి చంద్రశేఖర్, బచ్చు కృష్ణకుమారి, బచ్చు రఘునాథ్, దాసినేని శ్రీనివాసరావు, శోభిల ఏడుకొండలు, బాలకృష్ణారావు, కొల్లూరి ఇమ్మానియేలు, డేగల రాఘవ, బోగిరెడ్డి బుజ్జి, మండలి సుధీర్, కటికల బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని కూటమి నేతలతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమీక్ష నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, సీనియర్ నాయకులు అన్నపరెడ్డి వెంకటస్వామి, బండే రాఘవ, గుడివాక శివరావు, మర్రే గంగయ్య, శోభిల ఏడుకొండలు, కోట రాంబాబు, బొందలపాటి వీరబాబు, కోసూరు శివాజీ, గరికపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో ఆలపాటికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్

అగ్నిబాధితులకు రామకృష్ణ పరామర్శ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధమైంది. రూ. 15 లక్షల మేర నష్టం జరిగింది. బాధిత కుందేటి వెంకటేశ్వరరావు, పార్వతి కుటుంబాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ బాధితులను పరామర్శించారు. సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి దృష్టికి తీసుకువెళతామన్నారు. మాజీ కౌన్సిలర్ లోగిశెట్టి వెంకటస్వామి, జనసేన నాయకులు గడ్డం రాజు, శాయన శివయ్య, కోటి, సంకుల నాని, పృధ్వి, గణేష్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షురాలు విజయదుర్గకు సత్కారం



పెడన, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ పెడన పట్టణ శాఖ అధ్యక్షురాలిగా కొమ్మూరి విజయదుర్గ నియమితులయ్యారు. విజయదుర్గకు వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో సత్కారం జరిగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా, వాసవీ మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు కొమ్మూరి సుధారాణి, అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీతాయారు, ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి, గౌరవ సలహాదారు కొల్లూరి మంజులత తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ల పనితీరులో రిసెప్షన్ వ్యవస్థ కీలకం : ఏఎస్పీ



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఏఎస్పీ వి.వి.నాయుడు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్ల పనితీరును మెరుగుపర్చేందుకు రిసెప్షన్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఏఎస్పీ వి.వి.నాయుడు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో రిసెప్షనిస్టుల నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించేందుకు వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రిసెప్షన్ డ్యూటీలు నిర్వహించే మహిళా పోలీసులు హాజరయ్యారు. ఏఎస్పీ మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే సందర్శకుల సమస్యలను విని సానుభూతితో స్పందించాలన్నారు. సమస్యలను పరిష్కరించే విధానాలను, కేసుల స్వీకరణ, మౌలిక దర్యాప్తు విధానాలను ఆయన వివరించారు. భద్రతా ప్రమాణాలు, నైతిక బాధ్యతలను విశదీకరించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఇ. రమణమ్మ, మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వాసా వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

యూనియన్ బ్యాంకు డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి



డిజిటల్ పబ్లిక్ లైబ్రరీని ప్రారంభిస్తున్న జీఎం సి.వి.ఎన్ భాస్కరరావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా బ్యాంకు ఫౌండర్స్ బ్రాంచ్‌గా మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకు డిజిటల్ పబ్లిక్ లైబ్రరీని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సి.వి.ఎన్ భాస్కరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, సామాజిక సేవలో భాగంగా పబ్లిక్ లైబ్రరీని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్ కాటం వెంకట్రావు, డిప్యూటీ రీజనల్ హెడ్ రామలింగారెడ్డి, బ్రాంచ్ హెడ్ ఝాన్సీ, తాతాజీ, రిటైర్డు ఆంధ్రాబ్యాంకు అసోసియేషన్ నాయకుడు కొల్లు సాయిమోహన్, మునీర్, విశ్వేశ్వరరావు, రాజారామ్, పట్టాభి పీఠం ప్రతినిధులు సింగరాజు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మినుము రైతులకు సూచనలు అందజేస్తున్న ఏవో మురళీకృష్ణ

మినుము రైతులు సమస్య రక్షణ చర్యలు చేపట్టాలి

ఘంటసాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. వి.రుద్రవరం గ్రామంలో మినుము పంటను రైతులతో కలసి ఆయన పరిశీలించారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మినుము పంటలో పేనుబంక పెరిగే అవకాశం ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. పేనుబంక, రసం పీల్చే పురుగు చుట్టూ చేరి మొక్క రసం పీల్చి వడలిపోయేలా చేస్తాయని, తద్వారా దిగుబడులు తగ్గిపోతాయన్నారు. రైతులు వెంటనే డైమిథోయేట్ 400 మిల్లీలీటర్లు ఒక ఎకరా చొప్పున 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రైతులు పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు రశీదును పొంది, పంట కాలం ముగిసే వరకూ జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని తెలిపారు. వీఏఏ బి.దిలీప్, రైతులు పాల్గొన్నారు.



మాలమహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్‌ను కలిసిన 108 సిబ్బంది

108 సిబ్బందిని వేధిస్తున్న వెంకటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలి

చల్లపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కింది స్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న 108 ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వెంకటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వేధింపులు భరించలేకపోతున్నామంటూ న్యాయం చేయాలని కోరుతూ ఉద్యోగులు శుక్రవారం గోవర్ధన్‌ను కలిశారు. చల్లపల్లిలో గోవర్ధన్ విలేకర్లతో మాట్లాడుతూ, వెంకటేశ్వరరావు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ ఉద్యోగపరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. ఇప్పటికే పలువురిని విధుల నుంచి తప్పించారన్నారు. చల్లపల్లి ఈఎంటీ బసవరాజు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనతో సిబ్బందిని వేధించిన అంశాలు వెలుగుచూస్తున్నాయన్నారు. వెంకటేశ్వరరావును విధుల నుంచి తొలగించకుంటే భవిష్యత్ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. దాసి బసవరాజు, సిబ్బంది, పలువురు మద్దతుదారులు పాల్గొన్నారు.



సెల్ఫ్‌స్టార్ట్ పనిచేయక కరకట్టపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సును తోస్తున్న ప్రయాణికులు

మొరాయిస్తున్న కరకట్ట సర్వీసులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే కరకట్ట సర్వీసు ప్రయాణికులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. దానికి నిదర్శనమే ఈ ఫొటోలోని దృశ్యం. చల్లపల్లి నుంచి కరకట్ట మీదుగా విజయవాడ వెళ్లే ఏపీ 16 జడ్ 0622 బస్సు శుక్రవారం నడిరోడ్డుపై ఆగిపోయింది. సెల్ఫ్ స్టార్ట్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు కిందకు దిగి, బస్సు తోసి స్టార్ట్ అయ్యేందుకు సేవలందించారు. సరైన నిర్వహణ లేక అవనిగడ్డ డిపోకు చెందిన బస్సులు పలు మార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. కనీసం సెల్ఫ్ కూడా లేకపోతే ఎలా అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తూ, బస్సు తోస్తున్న ఫోటోను అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ఆర్టీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభను చాటిన విద్యార్థులు

మాస్టర్ ఇకె బాలభాను విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరిగిన మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో మచిలీపట్నం మాస్టర్ ఈకే బాలభాను విద్యాలయం విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. మ్యాథ్స్ విభాగంలో ఆరో తరగతి విద్యార్థి జి.భార్గవ్, ఎనిమిదో తరగతి విద్యార్థి టి.ఆకాష్ మూడో బహుమతి సాధించారు. సైన్స్ విభాగంలో ఆరో తరగతి విద్యార్థినులు భవ్యశ్రీ, టి.ప్రణవ సూర్య ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలను పాఠశాల కరెస్పాండెంట్ సిహెచ్ఎస్ఎన్‌రాజు అభినందించారు.



వైభవంగా శివ కల్యాణం

చల్లపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వక్కలగడ్డలోని శివ గంగమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం శివకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలు పాగోలు లీలా ఫణికుమార్ - అశ్విని దంపతులచే సూర్య రంగనాథాచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. శివలింగానికి అభిషేకాలు, శివగంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపి, కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లీలాఫణికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పాగోలు వెంకటేశ్వరరావు, వీఆర్వో నాగమల్లేశ్వరరావు దంపతులు పర్యవేక్షించారు.

శ్రీశైలంలో అన్నదానానికి ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో అన్నదాన కార్యక్రమానికి బియ్యం, ఇతర వస్తువులు పంపుతున్నట్లు కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము తెలిపారు. శుక్రవారం ఆయన బంధువులతో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు.